# కుప్పంలో ప్రతి ఇంటికి...'సోలార్' విద్యుత్ కనెక్షన్ల

- ఏపిఎస్‌పిడిసిఎల్ సిఎండి సంతోష్‌రావు -
ఇప్పటికే యాభైవేల సర్వీసులు గుర్తింపు
-వ్యవసాయ ఫీడర్లకు సైతం కనెక్షన్లు !

కుప్పం, నవంబర్ 22 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో త్వరలోనే రాయితీతో సౌర విద్యుత్ (సోలార్)కనెక్షన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎపి సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పోరేషన్ లిమిటెడ్ (ఎపిఎస్‌పిడిసిఎల్) చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం కుప్పం రెస్కో ప్రధాన కార్యాలయంలో ఆయన రెస్కో మేనేజి ంగ్ డైరెక్టర్ సోమశేఖర్, డిఇ మదన్ మోహన్, ఇతర రెస్కో అధికారులతో కలసి సోలార్ ప్రాజెక్ట అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. కుప్పం రెస్కో పరిధిలో మొత్తం 1.3లక్షల సర్వీసులు ఉన్నాయన్నారు. వీటిలో గృహాలకు సంబంధించి సుమారు 72వేల సర్వీసులు ఉండగా ఒకే ఇంట్లో అదనంగా సర్వీసులు సైతం కలిగి ఉన్న వాటిని గుర్తించి మొత్తం 50వేల గృహాలకు సోలార్ కనెక్షన్లు మంజూరు చేసేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు పేర్కొన్నారు. అలాగే 137 వ్యవసాయ ఫీడర్లలో సైతం



అధికారుల సమావేశంలో ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి

ముున్ముందు సోలార్ కనెక్షన్లు అందిస్తామన్నారు. ఇప్పటికే సోలార్ కనెక్షన్ల ఏర్పాటుకు సంబంధించి రెస్కో అధికార యంత్రాంగం సర్వే పూర్తి చేసిందన్నారు. ఆయా ఇళ్ల విస్తీర్ణం, ఏమేర విద్యుత్ అవసరమో గుర్తించారన్నారు. మొత్తం ప్రతిపాదనలను ఈనెల 25వతేది రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో వ ందశాతం సోలార్ విద్యుద్ధీ కరణ పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు సిఎండి తెలిపారు. టెండర్లు ఆహ్వానించి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎపిఎస్‌పిడిసిఎల్, రెస్కో అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు సిఎండి సంతోష్‌రావును ఎపిఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, స్థానిక నేతలు రెస్కో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# యూనియన్ బ్యాంకులో... అప్రైజర్ చేతివాటం

- తక్కువ రకం నగలు తనఖా పెట్టి రూ.40 లక్షలు తీసుకున్న వైనం
- ఆడిట్‌లో వ్యత్యాసం రావడంతో డబ్బులు తిరిగి చెల్లించిన అప్రైజర్
- ఆలస్యంగా పోలీసులకు బ్యాంకు అధికారులు ఫిర్యాదు

యాదమరి, నవంబర్ 22 ప్రభాతవార్త: యాదమరి యూనియన్ బ్యాంకులో బంగారు రుణాల మంజూరు కోసం బంగారు నగల సామర్థ్యంను నిర్ధారించే అప్రైజర్ చేతివాటం చూపాడు. తాను తక్కువ రకం బంగారు నగలను ఇతరుల పేరిట బ్యాంకులో తనఖా పెట్టి 40 లక్షల రూపాయల వరకు రుణం పొందాడు. ఈ వ్యవహారం చాలా రోజులుగా జరుగుతున్నప్పటికీ బ్యాంకు ఆడిట్ అధికారులు బ్యాంకు ఆడిట్‌కు రావడానికి ముందు అప్రైజర్‌కు సమా చారం ఇవ్వడంతో అప్పటికే ఎదోలా చేసి అప్రైజర్ వ్యవహారంను సర్దుబాటు చేసేవాడు. అయితే విజయవాడ మెయిన్ బ్రాంచ్ నుండి అప్రైజర్‌కు సమాచారం ఇవ్వకుండా ఒక్కసారిగా ఆడిట్ కోసం ఆడిటర్లు రావడంతో అప్రైజర్ నకిలీ బంగారు తాకట్టు వ్యవహారం బహిర్గం అయ్యింది. బ్యాంకులో విధులు నిర్వర్తించే స్థానికులు ఒకరిద్దరి పేర్లతో ఈ తక్కువ నాణ్యత కల్గిన బంగారు నగలను తానఖా పెట్టి అప్రైజర్ భాస్కరాచ్చారి బ్యాంకు నుండి 40 లక్షల రూపాయలు పొందాడు. ఈ వ్యవహారం బహిర్గతం కావడంతో అప్రైజర్ భాస్కరాచ్చారి ఎలాగోలా సర్ధి 40 లక్షల రూపాయలను బ్యాంకు అధికారులకు చెల్లించాడు. అయితే బ్యాంకు అధికారులు మళ్ళీ భాస్కరాచ్చారిని విధుల్లోకి తీసుకోకుండా ఇతర బ్యాంకు నుండి ఒక అప్రైజర్‌ను డిప్యుటేషన్‌పై వేసుకుని విధులు నిర్వర్తిస్తుండటంతో అప్రైజర్ ఆవేశం చెంది బ్యాంకు అధికారులపై ఆరోపణలు చేయడం



ప్రారంభించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు కొంతమంది బాధితుల బంగారు నగలు తక్కువ వడ్డీకి తాకట్టు పెట్టి ఇస్తానని చెప్పి తీసుకెళ్ళి ఇప్పటి వరకు రుణం మంజూరు చేయాలని ఒకరిద్దరు వినియోగదారులు బ్యాంకు అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై బ్యాంకు మేనేజర్ మురళీ బ్యాంకు ఉన్నత అధికారులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**బంగారు నగల ఖాతాదారులకు భరోసా :**

యాదమరి యూనియన్ బ్యాంకులో బంగారు నగలు తాకట్టు పెట్టిన తనఖాదారులకు బ్యాంకు మేనేజర్ మురళీ భరోసా కల్పించారు. బ్యాంకులో తనఖా పెట్టిన బంగారు నగలకు ఎలాంటి ధోకా లేదని, బ్యాంకు నుండి బంగారు నగలు ఏవి దొంగతనానికి గురి కాలేదని ఈ విషయంపై ఖాతా దారులు నిర్భయంగా వుండవచ్చునన్నారు. బ్యాంకులో బంగారు నగలు తాకట్టు పెట్టి రుణం పొందిన ఖాతాదారుల బంగారు నగలు తమవద్దే లాకర్‌లో భద్రంగా వుందన్నారు. అప్రైజర్ భాస్కరాచ్చారి సైతం తక్కువ నాణ్యత కల్గిన బంగారు నగలు తాకట్టు పెట్టి రుణం పొందాడని, ఆ రుణం సైతం తిరిగి చెల్లించడం జరిగిందన్నారు. ఒకరిద్దరి నుండి ఇతర బ్యాంకులో తక్కువ వడ్డీకి రుణం తీసి ఇస్తానని నమ్మించి బంగారు నగలు తీసుకుని వున్న వారు మాత్రమే అప్రైజర్ భాస్కరాచ్చారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

# సంస్కృత వర్సిటీలో... డ్రగ్స్ కలకలం!

-హాస్టల్ విద్యార్థుల వద్ద డ్రగ్స్ ప్యాకెట్లు లభ్యం -ఒడిస్సాకు చెందిన విద్యార్థి ప్రధాన సూత్రధారిగా గుర్తింపు
-అదే వర్సిటీలో 20 మంది విద్యార్థులకు విక్రయించినట్లు సమాచారం -యాన్టీ డ్రగ్ కమిటీతో విచారిస్తున్నాం..మీడియాతో వర్సిటీ అధికారులు

తిరుపతి విద్య నవంబర్ 22 ప్రభాతవార్త: తిరుపతి జాతీయ సంస్క ృత వర్సిటీలో డ్రగ్స్ కలకలం రేపాయి.వర్సిటీలో యూజీ చదువుతూ హాస్టల్ లో ఉంటున్న ఒడిస్సాకు చెందిన శతపథి అనే విద్యార్థి ప్రధాన సూత్రధారిగా గుర్తించారు.ఇటీవల తన స్వగ్రామం ఒరిస్సా నుంచి గంజాయి ప్యాకెట్లు తీసుకవచ్చి అదే వర్సిటీలో చదువుతున్న విజయవాడకు చెందిన ఆంజనేయులు అనే విధ్యార్థి ద్వారా సుమారు 16 ప్యాకెట్ల గంజాయి తోటి విద్యార్థులకు విక్రయించినట్లు సుమాచారం. ఈవిషయంపై వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ రమశ్రీ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ సంస్క ృత వర్సిటీల్లో గతంలో ఎన్నడూ డ్రగ్స్,గంజాయి ప్రస్తావన వినబడిన దాశాలాలు లేవన్నారు. ప్రస్తుతం యూజీ పరీక్షలు జరుగుతన్న నేపథ్యంలో హాస్టల్ విద్యార్థులు కొందరు పరీక్షలకు గైర్హాజరవడం జరిగిందన్నారు.పరీక్షలకు హాజరుకాని విద్యార్థులను గుర్తించే క్రమంలో హిస్టల్స్ లో ఛీఫ్ వార్డన్ తనిఖీ చేపట్టారని చెప్పారు.అందులో ఒడిస్సాకు చెందిన విద్యార్థి గంజాయి సేవించినట్లు హాస్టల్ సిబ్బంది తమకు సమాచారం అందించారని తెలిపారు. సదరు విద్యార్థితో మాట్లాడగా సుమారు 20 ప్యాకెట్ల గంజాయి తీసుకువచ్చానని,16 ప్యాకెట్లు తోటి విద్యార్థులకు విక్రయించినట్లు



ఒప్పుకున్నారని చెప్పారు. దీనిపై వెంటనే స్పందించి వర్సిటీలోని యాన్టీ డ్రగ్స్ కమిటీ ఆధ్వర్యంలో విస్త ృత స్థాయి సమావేశం నిర్వహించామని తెలియజేశారు.గంజాయి మూలాల పైన,ఇతర విద్యార్థులకు విక్రయించిన ప్రక్రియపైనా ఆరా తీస్తున్నామని,కమిటీ నివేధిక అందిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**-వర్సిటీ అధికారులపై చర్యలు తీసుకోవాలి**

జాతీయ సంస్కృత వర్సిటీలో గత ఆరు నెలలుగా డ్రగ్స్ వ్యవహారం నడుస్తున్నా అధికారులు చూపి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.ఒరిస్సా విద్యార్థి హాస్టల్లో డ్రగ్స్ వ్యాపారం చేస్తూ ఎంతమంది విద్యార్థులను డ్రగ్స్‌కు బానిసలను చేశారో తెలియడం లేదన్నారు.వెంటనే పోలీసులు అధికారులు వర్సిటీని జల్లెడ పట్టి వర్సిటీలో జరుగుతున్న డ్రగ్స్ దందా పై అధికారులకు సమాచారం ఉన్నా పట్టించుకోలేదని వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ,ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ,వైయస్సార్సీపీ విద్యార్థి సంఘాలు డిమాండు చేశాయి

# లీజుదారుల ఉచ్చులో...సబ్ లీజుదారులు

-అందరూ కలిసి మున్సిపాలిటి ఆదాయాలకు గండి!

**శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మున్సిపాలిటికి ఆర్థిక సంక్షోభం వెంటాడుతుంది. మున్సిపాలిటికి రావాల్సిన పార్కింగ్ ఆదాయాలను శ్రీకాళహస్తీశ్వరాలయం ఇవ్వమంటూ మొండికేసింది. జిఓ ఉన్నా మాకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇక కోర్టుల్లో ఏళ్ళ తరబడి ఏడు కేసులు నడుస్తున్నాయి. ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు మునిసిపల్ షాపులను లీజుకు తీసుకొని, సబ్‌లీజుకు ఇచ్చుకొని పబ్బం గడుపు కుంటున్నారు. హఠాత్తుగా మున్సిపాలిటి అధికారులు షాపులను సీజ్ చేయటంతో సబ్‌లీజుదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వారి వంట పాత్రలు, ఫ్రిజ్‌లు, లోపలే ఉండటంతో వీధిన పడే పరిస్థితి ఏర్పడింది.**

శ్రీకాళహస్తి,నవంబర్ 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మున్సిపాలిటికి సంబంధించిన దుకాణాల లీజుకు సంబంధించి రాష్ట్ర హైకోర్టులో ఏడు కేసులు నడుస్తున్నాయి. ఇందులో ఎక్కువ భాగం కేసులు, లీజుదారులు మున్సిపాలిటి మీద వెళ్ళినవే. శ్రీకాళహస్తి మున్సిపాలిటికి సంబంధించిన పట్టణంలో అనేక షాపులను పలుకుబడి కలిగిన నాయకులు లీజుకు తీసుకొని, సబ్ లీజులకు ఇచ్చి తన ఆదాయాలు చూచుకున్నారు. అయితే ఇప్పుడు మునిసిపల్ అధికారులు లీజులు చెల్లించని షాపులను మూత వేడడంతో, సబ్‌లీజుదారుని పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. సంతమైదానంలో స్థలాన్ని ఓ విద్యాసంస్థకు అప్పగించింది. అక్కడ సుమారు రూ.పాతిక లక్షలు వెచ్చించి విద్యాసంస్థ భవనాలు నిర్మించింది. మున్సిపాలిటి ఖాళీ చేయమంటే తాము పెట్టిన పెట్టుబడి తిరిగి ఇవ్వాలని కోరారు. ఈ సమస్య సుమారు ఆరుసంవత్సరాల నుంచి కోర్టులో నలుగుతుంది. ఇక ఇటీవల ఎన్నికల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గం తెలుగుదేశం హస్తగతం అయ్యింది. గతంలో పట్టణ నడిబొడ్డులోని తేరువీధిలో ఉన్న షాపింగ్ కాంప్లెక్సు అతిథిగృహాన్ని మాజీ కౌన్సిలర్ వైకాపా మద్దతు దారుడు లీజుకు తీసుకున్నారు. నెలకు రూ.1.15లక్షల లీజుతో తీసుకున్నారు. అయితే సక్రమంగా లీజు సొమ్ములు చెల్లించ లేదని మున్సిపల్ రికార్డులు చెబుతున్నాయి. ఆరునెలల అడ్వాన్సు చెల్లించాల్సి ఉండగా మూడు నెలలది మాత్రం చెల్లించారు. ప్రభుత్వం మారటంతో తమను ఖాళీ చేయిస్తారనే భావంతో లీజు దారుడు కోర్టుకెక్కాడు. తమను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. లీజుదారుడు ఆరు నెలల లీజు మొత్తం బకాయి



తేరువీధిలోని మున్సిపల్ అతిథి గృహం

ఉన్నారు. అంటే ఆతని నుంచి రూ.8లక్షలు పాత బకాయి రావాల్సి ఉండగా జూన్ నుంచి కోర్టు కేసులతో బాడుగ చెల్లించటం లేదు. డిసెంబర్ నెలాఖరుకు లీజు కాలం పూర్తి అవుతుంది. ఇక కూరగాయల మార్కెట్ వద్ద ఓ వైకాపా పలుకుబడితో వ్యక్తి గదిని తీసుకున్నారు. రూ.లక్షకుపైగా బకాయితో, ఈ కేసు కోర్టుకు ఎక్కింది. ఇక పాత నెల్లూరు బస్టాండు వద్ద పూల దుకాణాలను మరో వైకాపా మద్దతు దారుడు తీసుకున్నాడు. ఆయన లీజు మొత్తం చెల్లించక పోగా తాను ఆనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యానని కోర్టును ఆశ్రయించాడు. ఇక కూరగాయల మార్కెట్ వెనుక మరో ఇద్దరు వైకాపా మద్దతుదారులు స్థలం లీజుకు తీసుకు న్నారు. ప్రభుత్వం మారటంతో తమను ఖాళీ చేయిస్తారని ముందస్తుగా కోర్టును ఆశ్రయించారు. ఎన్‌టిఆర్ పార్కు వద్ద మరో వైకాపా మద్దతు దారుడు లీజుకు తీసుకున్నారు. కానీ చెల్లింపులు చెయక కోర్టు ఆశ్రయంతో పబ్బం గడుపుకుంటున్నారు.

**జిఓ ఉన్నా లెక్క చేయని దేవస్థానం:**

శ్రీకాళహస్తి మున్సిపాలిటి కార్‌పార్కింగ్‌ను నిర్వహించేది. అయితే గోపాల కృష్ణారెడ్డి మంత్రిగా ఉన్నపుడు మునన్సిపాలిటి,దేవస్థానం వేర్వేరుగా పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తుండటంతో ఇబ్బందిగా మారిందని దేవస్థానం వసూలు చేసుకుంటూ 40శాతం మున్సిపాలిటికి చెల్లించాలని ప్రభుత్వ ఉత్తర్వులు సాధిం చారు. 2016లో ఇక్కడ పని చేసిన ఇఓ పేచీ పెట్టారు. దాంతో దేవస్థానం నుంచి మున్సిపాలిటికి రావా ల్సిన వాటా అందటం లేదు. ఎన్నో సార్లు మున్సిపాలిటి దేవస్థానం అధికారులకు మొరబెట్టు కుంటున్నారు. మరి ఈ సమస్య ఎలా పరిష్కారమౌతుందో ఏమో ముక్కంటీశునికే ఎరుక.

# ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం : సిపిఐ

వెంకటగిరి, నవంబర్ 22 ప్రభాతవార్త : ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అలనాథ రెడ్డి తెలిపారు. వెంకటగిరి లోని ఓ కల్యాణ మండపంలో శ్రీకాళహస్తి, వెంకటగిరి నియోజకవర్గాల పార్టీ శాఖ కార్యదర్శిల వర్క్ షాప్‌ను బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పి,మురళీలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను శరవేగంగా అమలుపరుస్తున్నారని ఇచ్చిన వాగ్దానాలను సైతం అమలుపరచడం లేదని గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున పోరాడి సాధించిన జీవోలను సైతం అమలు పరుచుకునేందుకు పెద్ద పోరాటాలకు సన్నద్ధం కావలసిన పరిస్థితులు నేడు నెలకొని ఉన్నది అని అన్నారు. ఈనెల 26వ తేదీన దేశవ్యాప్తంగా 500 జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. వర్క్ షాప్ నందు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జనమాల గురవయ్య ,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ. నాయకులు శివకుమార్. మోహన్ రెడ్డి. శ్రీనివాసులు. మురళి. మల్లికార్జున్. రంగయ్య. జాన్, మునీంద్ర. శివ. రాజయ్య, మణి వెంకటయ్య, కృష్ణ. పార్టీ శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.




# ఆక్రమణలపై అధికారుల కన్నెర్ర

శ్రీకాళహస్తి,నవంబర్ 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని సన్నిధివీధిలో రోడ్డు ఆక్రమణలపై అధికారులు కన్నెర్ర జేసారు. శుక్రవారం పొద్దుపొడవక ముందే దేవ స్థానం, మున్సిపాలిటి, పోలీసు అధికా రులు మూకుమ్మడిగా ఆక్రమణల తొలగిం పుకు చర్యలు తీసుకున్నారు. నాలుగు రోజుల క్రితం రోడ్డు మీదకు విస్తరించిన ఆక్రమణలను తొలగించుకొని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని అధికారులు సూచించారు. ఓవైపు గొడ్డెరును ఆక్రమించుకున్న ఆక్రమణ దారులు రోడ్డు మీద సగానికి ముందుకు వచ్చారు. దాంతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో సతమతమౌతున్నారు.ఈ నేపథ్యంలో పలు మార్లు ఆక్రమణ దారులకు మున్సిపాలిటి నోటీసులు ఇచ్చినా పట్టించుకోలేదు. పైగా మున్సిపల్ అదికారులపై తిరగబడ్డారు. శుక్రవారం వేకువ జామున ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి, సిఐ డి.గోపి, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు జెసిబిలతో సన్నిధివీధిలో సిద్ధమయ్యారు. జలవినాయకుని ఆలయం నుంచి లోబావి వరకు పడమర వైపు ఉన్న ఆక్రమణలను తొలగించారు. కొందరు లొల్లి చేసినా అధికారులు అనుమతించలేదు. సుమారు వంద ఆక్రమణలను ట్రాఫిక్‌కుఅ డ్డం లేకుండా తొలగించారు.



రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

**గొడ్డెరు ఆక్రమణలను పట్టించుకోని రెవెన్యూ:**

సన్నిధివీధిలో ఆక్రమణలకు మూలం వెనుక ఉన్న 'గొడ్డెరు' గొడ్డెరు శుకబ్రహ్మాశ్రమం వద్ద నుంచి ఎంజిఎం వద్ద ఉన్న స్వర్ణముఖి వరకు ఉంది. కైలాసగిరుల్లోనూ, తుఫాను ఎసెంటర్ల వద్ద కురిసిన వర్షం నీరు గొడ్డెరు నుంచి స్వర్ణముఖి నదిలో కలుస్తుంది. అయితే గొడ్డెరు ను ఆక్రమణ దారులు విచ్చల విడిగా ఆక్రమించుకుంటుంటే రెవెన్యూ శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారించారు. ఒరెండేళ్ళ క్రితం భారీ వర్షాలకు గొడ్డెరు నుంచి నీళ్ళు వెళ్ళలేక ముంపుకు గురైంది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారుల మొద్దు నిద్రనుంచి మేల్కొని గొడ్డెరులోని ఆక్రమణలపై దృష్టి పెడితే సన్నిధివీధిలో దుకాణాలు రోడ్ల మీదకు వచ్చే అవకాశం ఉండదు.

# పన్నుల వసూళ్ళపై ప్రత్యేక దృష్టి

- అనంతపురం రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్టేషన్ పి.విశ్వనాథ్



మున్సిపల్ ఆర్డీ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

చిత్తూరు, నవంబర్ 22 ప్రభాతవార్త: నగర పాలక సంస్థ పరిధిలో పన్నుల వసూళ్ళపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిం చాలని, మార్చి నాటికి పూర్తి స్థాయిలో పన్నులు, బకాయిలు వసూలు చేపట్టే లా ప్రణాళికా బద్దంగా పని చేయాలని అనంతపురం రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. అనంతపురం రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పి.విశ్వనాథ్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కమీషనర్లు, రెవెన్యూ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారు లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో వున్న బకా యిల వసూళ్ళ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లు, విద్యాసంస్థలు, లాడ్జిలు, కళ్యాణ మండపాలు, ప్రభుత్వ భవనాలను సంబంధించిన పన్నులను వసూలు చేయాల న్నారు. అలాగే దీర్ఘకాలికంగా పెద్దమొత్తంలో పన్న బకాయిలు వున్న వారిని గుర్తించి వారికి రెడ్ నోటీసు జారీ చేయాలని, అలాగే ఖాళీ స్థలాలు, నీటి పన్నులు వసూలు చేయాలన్నారు. పన్నుల వసూళ్ళ కోసం రానున్న 120 రోజులు చాలా కీలకమైనవని, ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి లక్ష్యాలను నిర్ధేశించుకుని బృందాలుగా ఏర్పడి పని చేయాలన్నారు. అనునిత్యం క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహించచి పన్నుల వసూళ్ళను వేగవంతం చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ నరసింహ ప్రసాద్ పన్నుల వసూళ్ళపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్డీ సమావేశంలో నిర్ధేశించిన అంశాలపై రెవెన్యూ అధికారులకు దిశా నిర్ధేశం చేశారు. డివిజన్ స్థాయిలో పన్నుల వసూళ్ళను పక్కాగా చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమీషనర్ ఆవినేని ప్రసాద్, ఎంఇ వెంకటరామిరెడ్డి, ఆర్ఓ గోపాలకృష్ణవర్మ, ఉమా మహేశ్వర్‌రెడ్డి, ఆర్ఐలు, డిడిలు, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి కేసులో ఇద్దరు ముద్దాయిలు అరెస్టు

**22 కేజీల గంజాయి స్వాధీనం**

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 22 ప్రభాతవార్త : అక్రమ గంజాయి కేసులో ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసి 22 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి ఈస్ట్ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం గంజాయి అక్రమంగా తరలిస్తున్న ముద్దాయిలు సాతుపాటి లోకేశ్వర రావు (49), సాతుపాటి కుమారి (42)లును ఈస్ట్ పోలీసులు హోటల్ పూజిత వద్ద పట్టుకున్నారు. భార్య, భర్తలు ఇదివరలో గంజా అక్రమ రవాణా కేసులో సాతుపాటి లోకేశ్వర రావు ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో గడచిన ఫిబ్రవరి నెలలో ముద్దాయిగా వుండి చిత్తూరు జిల్లా జైల్‌లో రిమాండ్ ఖైదీ గా వుండి బెయిల్ పై వచ్చి తిరిగి తన భార్య కుమారితో కలిసి తన సొంత వూరు నగిరి, పుత్తూరు, నారాయనవనం, తమిళ నాడు ప్రాంతాలలో గంజా అమ్ముతునట్లు రాబడిన సమాచారం మేరకు పై ఇరువురి పై నిఘా వుంచగా వారు ఒడిస్సా రాష్ట్రం, చత్రాపూర్‌లో ప్రతాప్ చౌదరి అను వ్యక్తి వద్ద నుండి అధిక మొత్తం లో గంజా ను కొనుగోలు చేసి వాటిని చిన్న పొట్లములు గా చేసి రూపాయలు 200 ఒక్కటి చెప్పున స్టూడెంట్స్ కి, యువతకు అమ్ముకొని అక్రమార్జన చేస్తు, యువతను మత్తుకు బానిసలు చేస్తూ, వారి జీవితాలు నాశనం చేస్తునట్లు రాబడిన సమాచారం మేరకు తిరుపతి సబ్ డివిజనల్ పోలీసు అధికారి వెంకట నారాయణ వారి ఆదేశం మేరకు తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ రామక్రిష్ణ, నరసింహం లు సమాచారాన్ని తిరుపతి అర్బన్ తహశీల్దార్ భాగ్య లక్ష్మి ఇచ్చి మహిళా పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంధి ఇరువురు ముద్దాయిలను పాత తిరుచానూరు రోడ్, హోటల్ పూజిత కు పక్కన ఉత్తరం వైపు వున్న రోడ్ లో అరెస్టు చేసి వారి వద్ద వున్న 22 కేజీల గంజాయిని స్వాదీనము చేసుకొని వారిని జుడీష్యల్ కస్టడీ కి పంపారు. ఈ కేసు లో ముద్దాయిలుగా వున్న లోకేశ్వర రావు పాత నేరస్థుడుగా వుండి, అతనికి ఇదివరలో తమిళనాడులో దొంగతనం కేసులు వుండి శిక్ష అనుభవించినట్లు, అట్లే తిరుపతి నందు గుట్కా అక్రమ రవాణా కేసులో ముద్దాయిగా వున్నట్లు, ముద్దాయిల కుమారుడు శ్రీనివాసరావు కూడా తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్ పరిధి లో గడచిన సెప్టంబర్ మాసం లో పెద్దమొత్తం లో గంజా అక్రమ రవాణా కేసు లో పట్టుబడి ప్రస్తుతం చిత్తూరు జిల్లా జైల్ లో రిమాండ్ లో వున్నట్లు తెలిసింది. ఈ కేసు లో మరో ఇరువురు ముద్దాయిలు చత్రాపూర్ కి చెందిన ప్రతాప్ చౌదరి, ఒజికుప్పంకు చెందిన మరో వ్యక్తి అరెస్టు కావలసి వున్నది. ఈ కేసులో ప్రతిభ కనపరచిన తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ రామక్రిష్ణ, సబ్ ఇన్స్పెక్టర్ నరసింహం, సిబ్బంది ని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

# ఆర్టీసీ దుకాణదారులకు పవర్ కట్!

కోట, నవంబర్ 22 ప్రభాతవార్త : కోట పట్టణంలోని ఆర్టీసీ షాపింగ్ దుకాణాలు గత మూడు రోజులుగా గాఢాంధకారంలో ఉన్నాయని దుకాణ దారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మేరకు దుకాణదారులు శుక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ సుమారు 25 సంవత్సరాల క్రితం ఆర్టీసీ అధికారులు తమకు స్థలాలు కేటాయిస్తే ఆ స్థలంలో తాము సొంత ఖర్చులతో గదులు నిర్మించుకొని జీవనం సాగిస్తు న్నామని చెప్పారు. అయితే ఆర్టీసీ అధికారులకు, తమకు వివాదం రావడంతో తాము పంచాయతీ వైపు నిలబడి తమ గదులు పంచాయతీకి సంబంధించినవనే వాదనను న్యాయస్థానంలో చెప్పడంతో ఆ మేరకు న్యాయస్థానం పంచాయతీ పరిధిలోకి ఈ దుకాణాలను కేటాయించినట్లు తెలిపారు. అయితే గదులు బాడుగ విషయమై తమకు, పంచాయతీ అధికారులకు చర్చలు జరుగుతున్న నేపథ్యంలో కొంతమంది రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం విద్యుత్‌శాఖ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి తమ గదులకు విద్యుత్ సర్వీసులు తొలగించారని దుకాణదారులు ఆరోపిస్తున్నారు. తాము నెలనెలా విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నా, తమ గదులకు విద్యుత్ సర్వీసు అకారణంగా తొలగించారన్నారు. దీంతో చిరు వ్యాపారులు వందలాది లీటర్ల పాలు, విలువైన కూరగాయలు కుళ్లిపోయి పాడైపోయా యన్నారు. కనీసం అధికారులకు మానవత్వం లేకుండా పోయిందని, అసలు కోటలో ప్రజాస్వామ్యం బతికి ఉందా అనే అనుమానం కలుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయ లోపం వల్లే తాము ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. తాము ఇప్పటికే ఈ విషయమై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేష్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



# రైతు బజార్‌లో... కూరగాయల ధరల మోత

-ప్రకటించిన ధరలు కన్నా రూ.15, 20 రుపాయాలు అధికం
-వినియోగదారులు ఫిర్యాదు చేసిన వ్యాపారులపై చర్యలేవు

తిరుపతిరూరల్,నవంబర్22 ప్రభాతవార్త: తిరుపతి రైతుబజారులో వ్యాపారులు ఇష్టాను సారంగా కూరగాయలు ధరలు పెంచి విక్రయించిన అధికారులు పట్టించుకోలేదని వినియోగదారులు వాపోతున్నారు. రైతుబజారులో ప్రతిరోజు కూరగాయల ధరల పట్టికను ఏర్పాటు చేస్తారు. ఏస్టేట్ ఆఫీసర్ ప్రకటించిన ధరల పట్టికతో సంబంధం లేకుండా వ్యాపారులు కేజీపై రూ.15 రుపాయాల నుండి 20 రుపాయాల వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని కొనుగోలు దారులు వాపోతున్నారు. బోర్డుపై ప్రకటించిన ధరకు ఏ ఒక్క వ్యాపారి కూరగాయలు విక్రయించలేదని, అధిక ధరలకు కూరగాయలను విక్రయిస్తున్నారని... ప్రకటించిన ధర కంటే ఎందుకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రశ్నిస్తే కొనుగోలు దారులపై ఎదురుదాడికి దిగుతున్న సంఘటనలు ప్రతిరోజు తిరుపతి రైతుబజారులో దర్శనమిస్తాయి. తిరుపతి రైతుబజారులో కూరగాయలు విక్రయించే దుకాణాలు ఓ క్రమేపి కాకుండా ఇబ్బడిముబ్బడిగా ఇష్టానుసారంగా ముందుకు పెంచి, కొనుగోలు దారులకు అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసుకుని, ఓ నియంతలా వ్యాపారులు వ్యాపారాలు కొనసాగిస్తున్నారని ఆరోఫణలు ఉన్నాయి. నిజమైన రైతులు మాత్రం రోడ్డుపై బైఠాయించి కూరగాయలు విక్రయిస్తున్నారని, వ్యాపారులే అధిక ధరలు విక్రయిస్తున్నట్లు సమాచారం. దళారుల ప్రమేయం లేకుండా రైతులు పండించి కూరగాయలను నేరుగా రైతుబజారులో విక్రయించుటకు 1999లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతుబజారులను ఏర్పాటు చేసిన విషయం తెల్సిందే. రైతుబజారులు రానురాను వ్యాపార కేంద్రాలుగా మారాయి అనటం ఎలాంటి సందేహం లేదని కొనుగోలుదారులు అంటున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుబజారులో ధరలు పరిశీలించి, అధిక ధరలపై దృష్టి పెట్టాలని కొనుగోలుదారులు కోరుతున్నారు.



## జగన్‌కు కుటుంబ అనుబంధాలపై మాట్లాడే అర్హత లేదు

**శాంతిపురం, నవంబర్ 22(ప్రభాతవార్త):**



మాజీ సిఎం జగన్‌కు కుటుంబ బంధాలు, అనుబంధాల గురించి మాట్లాడే అర్హత లేదని రాష్ట్ర తెదేపా అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు తల్లిదండ్రుల గురించి జగన్ చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నా మన్నారు. జగన్ తాడేపల్లిలో నుంచి తన చెల్లి, తల్లి, కుటుంబీకుల గురించి అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. సిఎం చంద్రబాబు తన తల్లిదండ్రులకు అన్నం పెట్టారా, ప్రజలకు పరిచయం చేశారా అని మతిభ్రమించి మాట్లాడు తున్నారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యల పరిష్కారంకు కృషి చేసేలా అతనికి బుద్ధి ఇవ్వాలని వెంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఘనంగా వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు



**శాంతిపురం, నవంబర్ 22 ప్రభాతవార్త:** స్థానిక పరమహంస యోగానంద విద్యాలయలో వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ వైస్ ఎంపిపి ఉదయ్‌కుమార్, గుంజార్లపల్లి సర్పంచ్ జనార్ధనరెడ్డి, సొన్నేగానిపల్లి సర్పంచ్ మంజునాథరెడ్డి, టిడిపి అధ్యక్షుడు మునేగౌడు, ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

## నేడు కుప్పంలో మహా వారాహి యాగం

**కుప్పంరూరల్, నవంబర్ 22 ప్రభాతవార్త :**

కుప్పం నియోజకవర్గంలో తొలిసారిగా సాయిమాతా సేవా ట్రస్ట్ అధ్వర్యంలో తిరుచానూరు శ్రీ ఆది వారాహి శక్తి పీఠం శ్రీ మహారుద్ర వారాహి స్వామి నేతృత్వంలో శనివారం కుప్పంలోని శివశక్తి కళ్యాణ మండపంలో మహావారాహి యాగం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. 9391833999నెంబరును సంప్రదించాలని కోరారు.

## 25నుంచి కుప్పంలో సహస్ర శివలింగ దివ్యలింగ దర్శనం

**కుప్పం, నవంబర్ 22 ప్రభాతవార్త :** కుప్పంలోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సహజ రాజయోగ కేంద్రంలో ఈనెల 25-30 తేదీల వరకు సహస్ర శివలింగ దివ్యదర్శనం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు .వివరాలకు 7981631115నెంబరును సంప్రదించాలని కోరారు.

## 104 వైద్యసేవలు సద్వినియోగం

**యాదమరి, నవంబర్ 22 ప్రభాతవార్త:** 104 వాహన వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుని నాణ్యమైన వైద్యం పొందాలని పిహెచ్‌సి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. యాదమరి పిహెచ్‌సి పరిధిలోని ఎర్రచేను గ్రామంలో శుక్రవారం 104 సంచార వాహన వైద్య సేవలు అందించింది. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ ప్రతి నెల ఎర్రచేను గ్రామానికి 104 వాహనంలో వైద్యులు, వైద్య సిబ్బంది వచ్చి వైద్య సేవలను ప్రజలకు ఉచితంగా అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పి దివ్యశ్రీ, మహిళా ఆరోగ్య కార్యకర్త ప్రేమకుమారి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



## జడ్పీలో 10 మంది రికార్డ్ అసిస్టెంట్లకు పదోన్నతులు

**చిత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త:**

జిల్లా పరిషత్ పరిధిలో జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు శుక్రవారం 10 మంది రికార్డు అసిస్టెంట్లకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. అలాగే నలురురు ఆఫీసు సబార్డినేట్లకు టైపిస్టులుగా, ఒక ఆఫీసు సబార్డినేట్‌కు డ్రైవర్‌గా పదోన్నతులు కల్పిస్తూ సిఇఓ రవికుమార్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆరిమాని గంగమ్మ ఆలయంలో హుండీ చోరీ

**శ్రీరంగరాజపురం, నవంబర్ 22 ప్రభాతవార్త:**




మండలంలో ఆరుమాకులపల్లిలో వెలసిన ఆరిమాను గంగమ్మ గుడిలో గురువారం రాత్రి దొంగలు పడ్డారు. దొంగలు ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్ళిపోయారు. ఇలా హుండీని ఎత్తుకెళ్ళిన దొంగలు ఆలయం పరిసరాల్లో వున్న పంట పొలాల్లో హుండీని పగులగొట్టి అందులో వున్న సుమారు 5 వేల రూపాయలను దోచుకెళ్ళారు. ఆలయ ఇఓ తిమ్మారెడ్డి ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలంను పరిశీలించిన ఎస్ఐ సుమన్ హుండీ భద్రతపై ఆలయ ఇఓను నిలదీశారు. ఈ కేసులో సైతం దొంగలను పట్టుకుంటామని ఎస్ఐ సుమాన్ తెలిపారు.

## ధనంజయులు మృతి వైకాపాకు తీరని లోటు

**శ్రీరంగరాజపురం, నవంబర్ 22 ప్రభాతవార్త:**

మండలంలోని వివిపురం మాజీ ఎంపిటిసీ అంకనపల్లి గ్రామానికి చెందిన వైకాపా సీనియర్ నేత ధనంజయులు గ్రామంలోని స్వగృహంలో గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలిసిన మాజీ డిప్యుటీ సిఎం నారాయణస్వామి శుక్రవారం అక్కడి చేరుకుని ధనంజయుడు పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపిపి సరితజనార్ధన్, మంగుంట సర్పంచ్ రూప శేషాద్రి, పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు వున్నారు.



## వణికిస్తున్న చలి-రోగాల బారిన చిన్నారు

**నారాయణవనం, నవంబర్ 22 ప్రభాతవార్త :**

నారాయణవనం మండలంలో గత నాలుగు రోజులుగా మంచు కురవడంతో ముందు వెళ్లే వ్యక్తులు కూడా కనిపించడం లేదు. దీనికి తోడు చలి తీవ్రత ఎక్కువగా వుండడంతో పెద్ద చిన్న అనే తేడా లేకుండా రోగాల భారిన పడుతున్నారు. దీంతో ప్రజలతో పాటు వాహనచోదకులు ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం 7 గంటల వరకు కూడా మంచు తగ్గడ ం లేదు. జాతీయ రహదారిపై ముందు వెళ్లే వాహనాలు కనిపించకపోవడంతో డ్రైవర్లు వాహనాలను రోడ్డు పక్కన ఆపేశారు. ఓ పక్క మంచు మరో పక్క చలి తగ్గిన తర్వాత వాహనాలను తీసుకెళుతున్నారు. ఒక్కసారిగా చలి, పొగమంచు అధికమవడంతో చిన్నపిల్లలు రోగాలభారిన పడుతున్నారు.

## క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలి : జిల్లా ఎస్పీ

**తవణంపల్లె, నవంబర్ 22 ప్రభాతవార్త:**



గెలుపు ఓటములతో నిమిత్తం లేకుండా క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. మండలంలోని అరగొండ జడ్పీ బాలురోన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌ల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరుగనున్న 68వ రాష్ట్రస్థాయి అండర్-14 బాల బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలను ఎస్పీ శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఒక్కొక్కరిలో ఒక్కో నైపుణ్యం వుంటుందని తెలిపారు. క్రీడలువిద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి కీలకమనాన్నరు. అలాగే క్రీడల్లో ఎన్ని జట్లు పాల్గొన్నా విజేత జట్టు ఒక్కటేనని కావున విద్యార్థులు ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన అండర్-14 బాల, బాలికల క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. వారిలో స్ఫూర్తిని నింపడానికే ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనట్లు తెలిపారు. ఈసందర్భంగా బెలూన్‌లను ఎగుర వేసి క్రీడలను ప్రారంభించి క్రీడాకారులతో కలసి సాఫ్ట్‌బాల్ ఆట ఆడుతూ వారిలో స్ఫూర్తిని నింపారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, జడ్ప్రీటీసీ భారతి మధుకుమార్, స్థానిక సర్పంచ్ మల్లుదొరై ప్రశాంత్‌కుమార్, తహాశీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రెడ్డిబాబు, ఎంఈఓలు హేమలత, త్యాగరాజులురెడ్డి, చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీదర్‌నాయుడు, ఎస్సై చిరంజీవి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జె.వసంతవాణి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.కృష్ణ, హెచ్‌ఎంలు భువనేశ్వరి, మోహన్‌రెడ్డిలతో పాటు పలువురు పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## అర్ధగిరి సన్నిధిలో జిల్లా ఎస్పీ

**తవణంపల్లె, నవంబర్ 22 ప్రభాతవార్త:**

జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు శుక్రవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామివారిని దర్శించుకున్నారు. మండల పర్యటనకు విచ్చేసిన ఆయన అర్ధగిరి స్వామివారిని దర్శించుకున్నారు. ఎస్పీ వెంట చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్సై చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



## సకాలంలో సస్యరక్షణతోనే మామిడిలో అధిక దిగుబడి

**ఐరాల, నవంబర్ 22 ప్రభాతవార్త:**



మామిడి పంటకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చునని జిల్లా ఉద్యాన అధికారి డి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నాంపల్లెలోని ఎన్‌పి.సావిత్రమ్మ కళ్యాణమండపంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో మామిడి పంటకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై మండలంలోని మామిడి రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ స్వర్ణ, ఏఓ వరలక్ష్మి, ఆదర్శరైతులు సీతాపతినాయుడు, ధనుంజయ నాయుడు, వేణుగోపాల్, రాజేష్‌రెడ్డి పాటు మామిడి రైతులు పాల్గొన్నారు.

## యల్లమ్మతల్లి విగ్రహ మండల జల దీక్ష

**కల్లూరు, నవంబర్ 22 ప్రభాతవార్త :**

పులిచెర్లలో జిల్లా సహకార ప్రింటింగ్ ప్రెస్ మాజీ చైర్మన్ గోటూరి మురళి మోహన్‌రెడ్డి వారి ఇంటి ఇల వేల్పు శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం ఎల్లమ్మ తల్లి విగ్రహం మండల జలదీక్షకు అమ్మవారిని జలములో ఉంచారు. రాయల్ మోహన్, రమణారెడ్డి, మధుసూదన్ రెడ్డి, చంద్రారెడ్డి, ఎల్లారెడ్డి, ఎన్ ఎస్ రెడ్డి, ప్రకాష్, రవీందర్ రెడ్డి,, రామ్ కుమార్ రెడ్డి నిరంజన్ రెడ్డి, గురుస్వామి, నాగయ్య, శ్రీధర్, రమేష్ రెడ్డి, కేశవులు నాయుడు, గోటూరి వంశస్థుల కుటుంబ సభ్యులు, జిఎంఆర్ శ్రేయోభిలాషులు, సన్నిహితులు పాల్గొన్నారు.



## పంట పొలాలపై ఏనుగులు బీభత్సం

**కల్లూరు, నవంబర్ 22, ప్రభాతవార్త:**



పులిచెర్ల మండలం గడ్డం వారి పల్లి పంచాయతీ పరిధిలో గురువారం రాత్రి పంట పొలాలపై ఏనుగులు బీభత్సం సృష్టించాయి. పంచాయతీ పరిధిలో రైతులు సాగుచేసిన వరి, టమాటా, పంటలను మామిడి, కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి. రైతులు అష్ట కష్టాలతో పంటలను పండిస్తున్న సమయం లో ఏనుగులు పంటలను ధ్వంసం చేయడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. అటవీశాఖ అధికారులు పంటలను పరిశీలించారు. మండలంలో ఏనుగులు పంటలపై బీభత్సం సృష్టిస్తున్న అడవి శాఖాధికారులు చేస్తున్న కృషి ఫలించడం లేదు ప్రభుత్వం వెంటనే స్పందించి ఏనుగుల భారీ నుంచి పంటలను కాపాడాలని రైతులకు కోరుతున్నారు. ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను ముస్లిం ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఇన్నయతుల్లా పరిశీలించారు.

## కార్యకర్తలే తెదేపాకు కొండంత బలం

**కుప్పం, నవంబర్ 22 ప్రభాతవార్త :**

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే కొండంత బలం అని మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ 11వ క్లస్టర్ కొత్తపేటలో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ సత్యేంద్రశేఖర్, పార్టీ విస్తరణ కమిటీ సభ్యుడు కె. కన్నన్, యూనిట్ ఇన్‌చార్జ్ అప్పు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి శివ తేవర్, బూత్ ఇన్‌చార్జ్‌లు, వార్డు పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.



## మహిళను మోసగించిన వ్యక్తి అరెస్ట్!

**వి.కోట, నవంబర్ 22 ప్రభాతవార్త :**



గిరిజన కులానికి చెందిన ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసగించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పలమనేరు డిఎస్పీ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం వి.కోట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని బిసి పల్లి పంచాయతీ రామనాథపురంకు చెందిన ఓ గిరిజన మహిళను అదే గ్రామానికి చెందిన దినేష్‌కుమార్ అనే తను ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఆ మహిళకు తెలియకుండా దినేష్‌కుమార్ మరో మహిళను వివాహం చేసుకున్నాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దినేష్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఆసుపత్రిలో పారిశుద్ధ్య చర్యలు



**చౌడేపల్లి, నవంబర్ 22 ప్రభాతవార్త :** స్థానిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఆసుపత్రి నిండా పిచ్చిమొక్కలు, ముళ్ళ చెట్లు వుండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గుర్తించిన వైద్యాధికారి పవన్‌కుమార్ పంచాయతీ అధికారుల సహకారంతో పారిశుద్ధ్య చర్యలు చేప ట్టారు. హెల్త్‌అసిస్టెంట్‌సుధాకర్, రమణలు పర్యవేక్షించారు.

## రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

**పెద్దపంజాణి నవంబరు22 ప్రభాతవార్త :**

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు మండలంలోని చిన్నేపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మహ్మద్ సయ్యద్ ఎంపికైనట్లు హెచ్‌ఎం భాస్కర్ తెలిపారు. ఈ నెల28వ తేదీన పూతలపట్టు జెడ్పీహైస్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఇతనుపాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్బంగా అతన్ని హెచ్‌ఎం భాస్కర్,ముక్తార్ అహ్మద్,పీడీ భవాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



## మరుగుదొడ్ల వాడకంపై అవగాహన ర్యాలీ

**పెద్దపంజాణి నవంబరు 22 ప్రభాతవార్త :**



వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం పెద్దపంజాణి మండల కేంద్రంలో ఎంపిడిఓ బాలాజీ జిల్లా కోఆర్డినేటర్ శాంత ఆధ్వర్యంలో విద్యార్థులు, అధికారులు మరుగుదొడ్ల వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిసెంబర్ 10వ తేదీ వరకు మరుగుదొడ్ల వారోత్సవాలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ2 తులసిరామ్,ఏపీఓ మురుగేషన్,ఏఓ భాస్కర్,వెలుగు సిసిలు బాలునాయక్, కొండారెడ్డి,పంచాయతీ కార్యదర్శి లత,మండల కో ఆర్డినేటర్ సుధాకర్,రాజశేఖర్,గజేంద్ర,నాగరాజు,హేమంత్‌లు పాల్గొన్నారు.

## గంగా భవానీకి రాహుకాలాభిషేకం

**బోయకొండ(చౌడేపల్లి), నవంబర్ 22 ప్రభాతవార్త :**

శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు రాహుకాలాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాహుకాల సమయం నందు దంపతుల సమక్షంలో అర్చకులచే జరిగిన అభిషేకం వారిని అలరించింది. అన్నదానానికి పలమనేరుకు చెందిన నవీన్ అతని మిత్రబృందం కూరగాయలను విరాళంగా అందించారు. ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం, అధికార, అర్చక, సిబ్బంది సేవలందించారు.



## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

**చౌడేపల్లి, నవంబర్ 22 ప్రభాతవార్త :**



రాష్ట్రస్థాయి అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలకు మర్రిమా కులపల్లి విద్యార్థి ఎంపికయినట్లు ప్రధానోపాధ్యా యుడు నాదముని నాయుడు తెలిపారు. ఎంఎంపల్లి ఉన్నతపాఠశాలలో టెన్త్ చదువుతున్న అఫ్రిద్ ఉమ్మడి అనంతపురం జిల్లా గుంతకల్లులో జరిగే రాష్ట్రస్థాయి అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా తరపున పాల్గొంటారన్నారు. ఈ పోటీలు ఈనెల 23నుంచి 25వరకు జరుగుతాయన్నారు. పిడి పవన్‌కుమార్ హాజరయ్యారు.

## బ్యాట్మింటన్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

**చిత్తూరురూరల్, నవంబరు 22 ప్రభాతవార్త:**

మధ్యప్రదేశ్ నర్మదాపురం నందు జరిగిన 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ అండర్-19 బాలుర బ్యాట్మిం టన్ పోటీలలో బృందావన్ సీనియర్ సెకండరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన 12వ తరగతి విద్యార్థి టి. ప్రనవ్‌సాయి రాజస్థాన్ ఆటగాడితో తలపడి బ్రాంజ్ మెడల్ (తృతీయ బహుమతి) సాధించినట్లు పాఠశాల వ్యవస్థాపకులు శైలజకుమారి తెలిపారు. కాగా తృతీయ బహుమతి సాధించిన విద్యార్థి ప్రనవ్‌సాయికి పాఠశాల డైరెక్టరు ప్రియతేజ, అధ్యాపకులు తదితరులు అభినందనలు తెలిపారు.




## సిఎన్‌సి వర్క్‌షాపుపై అవగాహన సదస్సు

**చిత్తూరురూరల్, నవంబరు 22 ప్రభాతవార్త:**



చిత్తూరునగరం, సీతమ్స్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కంప్యూటర్ నుమెరికల్ కంట్రోల్(సిఎన్‌సి)పై అవగాహన సదస్సు నిర్వహించినట్లు మెకానికల్ విభాగం అధిపతి సతీష్‌కుమార్ తెలిపారు. సీతమ్స్ కళాశాల విద్యార్థులతో పాటు శ్రీ పద్మావతి మహిళా యూనివర్శిటీ విద్యార్థులు, ఆరీస్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొన్న ఈ సదస్సులో వివిధ పరిశ్రమలకు చెందిన నిపుణులు విద్యార్థులకు సందేహాలను నివృత్తి చేయడంతో ఈ అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకొన్నట్లు పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సును మెకానికల్ విభాగం అధిపతి సతీష్‌కుమార్‌తో పాటు కన్వీనర్ యుగంధర్, డిపార్టుమెంట్ అధ్యాపకులు విజయవంతంగా నిర్వహిం చడంతో కళాశాల యాజమాన్యం వైస్ చైర్మెన్ రంగనాథం, మేనేజింగ్ ట్రస్టీ డా. డి.ఏ.కల్పజ, సెక్రటరీ బద్రీనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలపతి, డీన్ అకడమిక్స్ డా.ఎం. శరవణన్, డీన్ ఆర్‌అండ్‌డి డా. ఎన్.సాంబశివరావులు సదస్సులో పాల్గొన్న ఇండస్ట్రీస్ నిపుణులు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## తిరుచ్చివాహనంపై పద్మావతీ సాక్షాత్కారం

**నారాయణవనం, నవంబర్ 22 ప్రభాతవార్త :**



నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారంతో భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అధిరోహించి ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా టిటిడి అన్నమాచార్య విభాగం ఆధ్వర్యంలో సంకీర్తనలను వినిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

## తల్లీబిడ్డ అదృశ్యంపై కేసు నమోదు!

**సత్యవేడు, నవంబరు 22 ప్రభాతవార్త:**



సత్యవేడు మండలం ఇరుగుళం గ్రామంలో నివసిస్తున్న మునిశేఖర్ సతీమణి హేమావతి, కూతురు చిన్నారి నయనిక తప్పిపోయింది. గురువారం ఉదయం ఉద్యోగ ఇంటర్వ్యూ కోసం వెళుతున్నట్టు హేమావతి తన కూతురు చిన్నారి నయనికను తీసుకుని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లింది. ఈ నేపథ్యంలో పొద్దుపోయినా ఇంటికి రాలేదు. ఈ క్రమంలో హేమావతి భర్త మునిశేఖర్ భార్య, కూతురు ఆచూకి కోసం బంధువుల ఇళ్ళకు వెళ్లి ఆరా తీసినా ఫలితం కనిపించలేదు. ఈ క్రమంలో హేమావతి, కూతురు నయనిక కనిపించకపోవడంపై శ్రీసిటీ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేయడం జరిగిందని ఈ సందర్భంగా శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. దీనిపై ఆ చూకి తెలిసిన వాళ్లు శ్రీసిటీ ఎస్ఐ 9346179833 ఫోన్ నెంబర్‌కి తెలియజేయాలన్నారు.

## విద్యా సామగ్రి పంపిణీ చేసిన చేయూత

**రేణిగుంట, నవంబరు 22 ప్రభాతవార్త:**



రేణిగుంట చెక్‌పోస్టు సమీపంలోని ఆర్‌సీఎం స్కూలులో చేయూత సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చేయూత సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షురాలు ప్రత్యూష మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పదో తరగతి పరీక్షలు రాసే ఆర్‌సీఎం విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు ప్రత్యూష, రేణిగుంట మేజర్ పంచాయతీ సర్పంచ్ నాగేషం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిబాబు, సంస్థ కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు శౌరి, బిందు, కవిత తదితరులు పాల్గొన్నారు.

## అపార్ ఐడీ వేగవంతం చేయండి



**కేవీబీ పురం, నవంబరు 22 ప్రభాతవార్త:**

విద్యార్థులు భవిష్యత్‌లో ప్రభుత్వం ద్వారా అన్ని సదుపాయాలు సులభంగా పొందుటకు ప్రారంభించిన అపార్ ఐడీ జనరేషన్‌ను వేగవంతం చేయాలని తిరుపతి జిల్లా సమగ్ర శిక్షణ టీం ఏపీవో గోపాల్‌రెడ్డి కేవీబీ పురం మండలం విద్యాశాఖ సిబ్బందిని ఆదేశించారు. కేవీబీ పురం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో జరుగుతున్న ఐడీ జనరేషన్‌ను పరిశీలించారు. ఈ తనిఖీలు అసిస్టెంట్ ఏఎంవో మధు, కేవీబీపురం మండల ఇన్‌చార్జి ఏఎస్‌వో సారథి, ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు కలిగించవద్దు : ఏఓ



**చంద్రగిరి, నవంబర్ 22 ప్రభాతవార్త:** ఎరువులు, పురుగు మందుల డీలర్లు రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని మండల వ్యవసాయ అధికారి సి.విజయ భాస్కర్ అన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.ప్రసాద్ రావు ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దుకాణ డీలర్లకు పలు సూచనలు చేశారు. రబీ సీజన్ ప్రారంభమవుతున్నందున ఎరువులు, పురుగు మందుల దుకాణ డీలర్లు కృత్రిమ కొరతను సృష్టించడం, అనధికారికంగా ఎరువులను నిల్వచేయడం, కల్తీ ఎరువులను విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. 21 నుండి 23 వరకు మూడు రోజులు ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## గోడకూలి 7 మందికి గాయాలు

-వైద్య చికిత్సలు పొందుతూ ఒకరు మృతి



**చంద్రగిరి, నవంబర్ 22 ప్రభాతవార్త:** ఇంటి ప్రహరీ నిర్మాణ పనులు చేస్తుండగా ప్రక్కనే వున్న ఇంటి కాంపౌండ్ వాల్ ఒక్కసారిగా కార్మికులపై కూలిపోయిన విచారకర దుర్ఘటన చంద్రగిరి, విజయనగర్ కాలనీలో చోటుచేసుకున్నది. చంద్రగిరికి చెందిన సుధాకర్ రెడ్డి ఇంటి ప్రహరీ నిర్మాణ పనులను చేపట్టారు. ఇందులో భాగంగా ముందుగా జెసిబితో గాడి తీయించాడు. గాడిని సక్రమంగా తీర్చిదిద్ది గోడను నిర్మించేందుకు శుక్రవారం ఒరిస్సాకు చెందిన 7 మంది కూలీలను పనిలోకి దింపారు. సుమారు 10 అడుగుల లోతున కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు చేస్తుండగా ఊహించని రీతిలో హఠాత్తుగా ప్రక్కన ఇంటి ప్రహరీ గోడ ఒక్కసారిగా కార్మికులపై కూలిపోయింది. దీంతో 7 మంది తీవ్రగాయాల పాలవడంతో ఆసుపత్రికి తరలించారు. తిరుపతి రుయాలో వైద్య చికిత్సలు పొందుతూ ఒక కూలీ కళాకర్ రానా (36) మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

## పర్యావరణాన్ని పరిరక్షించండి..!

టిటిడి ఫార్మాశిస్టు డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు

**రామచంద్రాపురం, నవంబర్ 22 ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిటిడి ఫార్మాశిస్టు డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మశీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ఫార్మశీ వారోత్సవాలను సొరకాయల పాళ్యం జడ్పీ హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఔషధ మొక్కల పెంపకాన్ని చేపట్టారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజలు దోహదపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫార్మశీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు సతీష్‌కుమార్, శివగామి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.




## ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు



**బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 22 ప్రభాతవార్త:** ఎరువులు పురుగు మందులు అధిక ధరలకు ఫెర్టిలైజర్ యజమానులు అమ్మితే ఫెర్టిలైజర్ కంట్రోల్ చట్ట రీత్యా చర్యలు తీసుకోబడతాయని సత్యవేడు సహాయ వ్యవసాయ సంచాలకులు జె.సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ వివరాలు, భౌతిక నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు నిలువలకు వ్యత్యాసంను పరిశీలించారు. రైతులకు అనుమతి లేని ఎరువులు, పురుగు మందులు అమ్మకూడదని, రైతులకు బిల్లులు కచ్చితంగా ఇవ్వాలని సూచించారు. వీరి వెంట వ్యవసాయ అధికారి భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వల్ప వర్షంతోనే రోడ్లు ఛిద్రం

శ్రీకాళహస్తి, నవంబర్ 22 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి సత్యవేడు నియోజకవర్గాలో అక్టోబర్ నెలలో కురిసిన వర్షాలతోఎటు చూసినా రోడ్లు ధ్వంసమయ్యాయి శ్రీకాళహస్తిలోని ఏర్పేడు, శ్రీకాళహస్తి రూరల్, తొట్టంబేడు, సత్యవేడు నియోజ కవర్గంలోని కెవిబి పురం మండలం, బుచ్చినాయు డుకండ్రిగ, వరదయ్యాపాళెం, సత్యవేడు మండలాల్లో ఎటు చూసినా ధ్వంసమైన రోడ్లతో వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు..

**అన్నదాతల ఆందోళన:**

శ్రీకాళహస్తి,సత్యవేడు నియోజకవర్గాల్లో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అక్టోబర్ మాసంలో వర్షంతో కొందరు నార్లు పోసుకున్నారు. మరి కొందరు నాట్లు వేస్తున్నారు. ఈ నెల అడపా దడపా వర్షాలు కురుస్తున్నాయి.కానీ సాధారణ సగటు వర్షపాతం కూడా నమోదు అవుతుందో లేదో అని ఆందోళన చెందుతున్నారు. దాంతో వ్యవసాయ పనులు స్థంభించాయి. నార్లు పోసుకున్న రైతులు నాట్లుకు అవకాశం లేకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక నాట్లుకు సిద్దం చేసుకున్న పైరు మురిగిపోతున్నాయి. నాట్లకు వర్షం అడ్డంకిగా మారింది.

## పుణ్యక్షేత్రంలో సిసి కెమెరాల పనితీరు ప్రశ్నార్ధకం



శ్రీకాళహస్తి, నవంబర్ 22 ప్రభాతవార్త ౹౹ఈచిత్రంలో కనిపిస్తున్నది పొన్నాలమ్మ ఆలయ మలుపు వద్ద ఉన్న పోల్‌కు ఉన్న సిసి కెమెరా దృశ్యం. ఏళ్ళ తరబడి ఈప్రాంతంలో ఈకెమెరా ఎప్పుడు పైకి చూస్తోంది. ఇక సూపర్‌బజారు వద్ద, జలవినాయకుని బ్రిడ్జి వద్ద ఉన్న కెమెరాలు ఎప్పుడూ పైకిచూస్తాయి. మహాశివరాత్రి సమీపిస్తున్నవేళ, మరియు మరో వైపు గంగజాతర రానుంది. అయితే గతంలో నవయువ నిర్మాణ సంస్థ విశ్వేశ్వరరావు పట్టణంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో ఆయన వితరణగా అప్పటి ఎస్ఐగా పనిచేస్తున్న సంజీవకుమార్ సాయంతో పట్టణంలో కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈకెమెరాలను అన్నింటిని ఆలయంలోసి సిసి కెమెరాలతో అనుసంధానం చేస్తారు. ఇకనైనా జిల్లా ఎస్‌పి సుబ్బారాయుడు స్పందించి పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో సిసి కెమెరాలు ఏర్పాటు పనితీరును మెరుగుపరచాల్సి న అవసరం ఎంతైనా ఉంది.

## పథకాలు అందేందుకే జియోట్యాగింగ్

తొట్టంబేడు, నవంబర్ 22 ప్రభాతవార్త :



నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేందుకే ఇండ్లలో ఉన్నయజమానులతో పాటు ఇండ్లను కూడా జియోట్యాగింగ్ చేయమని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని అందుకే మండలంలోని 27 పంచాయతీల్లో ఉన్న గ్రామాల్లో ప్రతి ఇంటిని సచివాలయ సిబ్బంది జియోట్యాగింగ్ చేయనున్నారని ఎంపిడిఓ సురేంద్రనాథ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాటల్లాడుతూ ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్దిదారులకు అందాలన్న, కొత్తగా రూపొందించే పథకాలు అందాలన్న జియోట్యాగింగ్ తప్పనిసరిగా ఉండాలని ఎంపిడిఓ తెలిపారు. ప్రతి ఒక్కరు సచివాలయ సిబ్బందికి సహకరించాలని ఎంపిడిఓ సురేంద్రనాథ్ కోరారు.

## వన్‌స్టాప్ సెంటర్‌పై అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన

తొట్టంబేడు, నవంబర్ 22 ప్రభాతవార్త :



వన్‌స్టాప్ సెంటర్‌పై అంగన్‌వాడీ సిబ్బందికి సుజాత, శ్రీకాళహస్తి ఐసిడిఎస్ సిడిపిఓ శాంతి దుర్గ అన్నారు. శుక్రవారం తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న ఐసిడిఎస్ భవనంలోని హాలులో శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాలకు సంబందించి అంగన్‌వాడీ టీచర్లుకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది సుజాత మాట్లాడుతూ మహిళలకు ఉచిత న్యాయం, ఉచిత వైద్యసాయం, ఉచిత రక్షణ సాయం, ఉచిత వసతి సాయం, ఉచిత కౌన్సిలింగ్ సాయంలతోపాటు హెల్ప్‌లైన్ నంబర్‌లు 9959776697, 8074269239కు ఫోన్ చేయాలన్నారు.భార్యభర్తల మద్య విబేధాలు తలెత్తినపుడు మహిళను తిరుపతిలోని మెటర్నటీ ఆస్పత్రిలో నాలుగు గదులు కేటాయించారని ఇక్కడకు మహిళను తరలించి కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. గుడ్‌టచ్,బ్యాడ్‌టచ్‌పై చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సిడిపిఓ తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, పలువురు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## పుణ్యక్షేత్రంలో ఆక్రమణల తొలగింపు

### -దుకాణదారులకు పోలీసుల స్వీట్ వార్నింగ్!

శ్రీకాళహస్తి, నవంబర్ 22 ప్రభాతవార్త :



పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి పట్టణంలో పోలీసులు ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచే సన్నిధివీధిలో అక్రమణల తొలగింపుతో పాటు పెండ్లిమండపం కూడలి వద్ద నుంచి నాదరపుష్కరిణి, కుమారస్వామి తిప్ప, పెద్దమసీదువీధి, పూర్ణంబేకరీ, పూసలవీధి, వీఎంసి సర్కిట్, వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాల ముందర అన రకమంగా వేసుకున్న రేకులషెడ్డును, చెక్కదిమ్మెలను తొలగించడంతో పాటు పలు ప్రకటనలకు సంబందించిన బోర్డులను తొలగించి ట్రాఫిక్‌క్లియరెన్స్ చేశారు. అంతేకాకుండా నాలుగుమాడావీధుల్లోని దుకాణాల దారులు రోడ్లపైనే కుర్చీలు, మంచాలు ఏర్పాటు చేయడంతో పాటు కాలువగట్లపై నిర్మాణాలు చేపట్టడంతో వారిని జెబిసితో తొలగించారు. కాగా బాబుఅగ్రహారం కోనేరు చుట్టు ఉన్న పండ్ల దుకాణదారులు, పోలీస్‌స్టేషన్ వద్ద పక్కనే ఉన్న ఓ హోటల్‌ను శుక్రవారం సాయంత్రం తనిఖీచేశారు. ఆక్రమణలను తొలగించాలని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండరాదని వివరించారు. కార్యక్రమంలో డిఎస్పీ కె.నరసింహమూర్తి, అర్బన్ సిఐ గోపి, టుటౌన్ సిఐ వెంకటేశులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు. ఈసందర్భంగా డిఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్‌నిబంధనలను తప్పకపాటించాలని లేకపోతే జరిమానా తప్పదని హెచ్చరించారు. ప్రజలందరు కూడా సహకరించాలని కోరారు. రానున్న మహాశివరాత్రి రోజుల్లో ఎలాంటి ఉత్సవాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండేలా చర్యలుతీసుకుంటున్నామన్నారు.

## పన్ను చెల్లింపు దారులకు అవగాహన సదస్సు

శ్రీకాళహస్తి, నవంబర్ 22 ప్రభాతవార్త :



పన్ను చెల్లింపు దారులకు వస్తుసేవల పన్ను గురించి మరింత అవగాహన కల్పించేందుకే శ్రీకాళహస్తి కమర్షియల్ ట్యాక్స్ అధికారిణి పి.పద్మావతి శుక్రవారం స్థానిక సన్నిధివీధిలోని ఎంజిఎం ఆస్పత్రిలో వ్యాపారులు, జిఎస్టీ రిటర్నులను సకాలంలో దాఖలు చేయాలని పన్నులు చెల్లించాలని సూచించారు. ప్రతి వ్యాపారి తమ విక్రయానికి సంబందించిన ఇన్‌వాయిస్/బిల్లును తప్పనిసరిగా ఈ-చలాన ఇవ్వాలని తెలిపారు. ఎంతో మంది వ్యాపారులు ఈ-వే బిల్లులు జారీ చేస్తూ బిఈబి, బిఈఈ పన్ను చెల్లింపుదారులతో ఇ-ఇన్‌వాయిస్‌లతోఅనుసంధానం చేస్తూ లావాదేవీలు జరుపుతున్నట్లు సెంట్రల్ నేషనల్ ఇన్మర్మేషన్ సెంటర్ ఎన్ఐసి గుర్తించిందని ఆయన తెలిపారు. ట్రేడ్‌మీట్ 2, జిఎస్‌టిఓ జి.ధనంజయు, జిఎసటిఓ(యు/టి)3, ఇన్‌స్పెక్టర్ సి.అరుణ్‌కుమార్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ వ్యాపారులకు, ట్యాక్స్ కన్సల్లెంట్లు ఆడిటర్లు మరియు చార్టడ్ అకౌంటెంట్లు కూడా పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా లక్ష బిల్వార్చన, కుంకుమార్చన

శ్రీకాళహస్తి, నవంబర్ 22 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తీశ్వరాయలంలో కార్తీకమాసంలో జరుగుతున్న లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలోని అలంకార మండపంలో వెలసిన స్వామిమఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు దూపదీప నైవేద్యాలు సమర్పించి విశేష హరతులిచ్చారు. అలంకార గురుకుల్ రాజేష్ గురుకుల్ మరియు పండితులు, అర్చకులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరిబాబుయాదవ్ మరియు ఆలయాధికారులు సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## 14 వ సిపిఎం జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 22 ప్రభాతవార్త :



డిసెంబర్ 1,2 తేదీల్లో సత్యవేడులో జరిగే సీపీఎం 14వ జిల్లా మహాసభల పోస్టర్‌ను నేడు యశోద నగర్ లోని సీపీఎం జిల్లా ఆఫీసులో ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రమేష్ మాట్లాడుతూ ఈ మహాసభలలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో నిచ్చిన హామీలు అమలు ఉన్న వైఫల్యాలను చర్చించనున్నామని, ఎన్నికల సందర్భంగా వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామన్నారని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ డిసెంబర్ 1,2 తేదీలలో సత్యవేడు లో సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు భాస్కర్,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం ,ఏ.పుల్లయ్య,జిల్లాకమిటి సభ్యులు సాయి లక్ష్మి,జయచంద్ర,మాధవ్, హరి,వెంకటేష్, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలను పాటించకుంటే చర్యలు తప్పవు

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 22 ప్రభాతవార్త :



ట్రాఫిక్ నియమాలను పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణచారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డిఎస్పి మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు అన్నారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణచారి, కేసుల వివరాలు వెల్లడించారు. తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్ల పై ట్రాఫిక్ పోలీసు వారు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 40 మంది ముద్దాయిలను 4 వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు తిరుపతి నందు హాజరు పరచగా గౌరవ జడ్జి గ్రంధి శ్రీనివాస్ గారు ఒక్కొక్కరికి 10,000 చొప్పున మొత్తం 40 మందికి 4,00,000 జరిమానా విధించారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పనితీరును జిల్లాఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, అభినంది ంచినారు. తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండ బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

## ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు

శ్రీకాళహస్తి,నవంబర్ 22 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తిలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను శుక్రవారం వ్యవసాయశాఖ ప్రత్యేక స్క్వాడ్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. శ్రీకాళ హస్తి నియోజకవర్గం వ్యవసా యక ప్రధాన ప్రాంతం.రబీసిజన్‌లో 32వేల హేక్టార్లలో పంటలను పండించటం అనవాయితి. ఈ నేపధ్యంలో ఇటీవల కాలంలో రైతులకు సకాలంలో ఎరువులు అందటం లేదని, నాణ్యమైన విత్తనాలు ప్రశ్నార్థకంగా ఉన్నాయనే విమర్శలు చోటు చేసుకున్నాయి. ఈ నేపధ్యంలో రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని, నాణ్యమైన విత్తనాలను అందించాలని ప్రభుత్వం సూచిస్తుంది.ఎవరైనా డీలర్లు వ్యాపార దృష్టితో రైతులకు నాసిరకం పురుగుల మందులువిత్తనాలు అందిస్తే వ్యాపారాల లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేసారు.ఈ దాడుల్లో సత్యవేడు ఎడిఏ సుబ్రమణ్యం, మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## తప్పుల విధానాలకు స్వస్తి చెప్పండి: రేహాన్

శ్రీకాళహస్తి,నవంబర్ 22 ప్రభాతవార్త:



సమాజంలో ఎదుటి వారి తప్పులను ఎత్తిచూపటం,వారి చెడును ప్రచారం చేయటంలోనే కాలం గడుపుతూ పాపాలను మూట కట్టుకుంటున్నామని ఈ విధానాలను విడనాడాలని అప్పుడే శాంతి సౌభాతృత్వం సాధ్యమౌతుందని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. జామియా మస్జిద్‌లో శుక్రవారం ప్రత్యేక ప్రార్ధనల అనంతరం ఆయన మాట్లాడుతూ మన ప్రవక్త ఆచరించిన విధానాలను అచరించక కష్టాలు,కన్నీళ్ళు కొని తెచ్చుకుంటున్నామని వివరించారు. ఇస్లాం మతం మంచిని నేర్పుతుంది. ఎదుటి వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకోమని చెబుతుంది. ఎదుటి వారి తప్పొప్పులపై దృష్టి సారించలేదని తమ తప్పులను సరిదిద్దుకోవాలని సూచిస్తుందన్నారు.కానీ మనం నిత్యం పరనిందలో నిమగ్నమైన మన జీవిత పరమార్థాన్ని తెలుసుకోలేక పోతున్నామని వివరించారు. మనం పాజిటివ్ విధానాలను ఆచరిస్తూ మన బిడ్డలనుకూడా అదే మార్గంలో నడిపించుటకు ప్రయత్నించాలని సూచించారు. మనం మన జీవితమేమిటో తెలుసుకోవాల న్నారు. ఇది తెలుసుకోవాలంటే మనం దివ్య ఖుర్ ఆన్‌ను పఠించాలని పిలుపు నిచ్చారు. నమాజు అలవాటు చేసుకోవాలని,గురువుల ప్రసంగాలను విని మసీదుల్లోనే వదలిపెట్టక ఆచరించుటకు ప్రయత్నించి సఫలీకృతులు కావాలని రేహాన్ పిలుపు నిచ్చారు.

## శివయ్య సేవలో కేంద్రక్రీడల మంత్రి

శ్రీకాళహస్తి,నవంబర్ 22 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరుని శుక్రవారం కేంద్ర యువజన వ్యవహారాలు,క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే కుటుంబసభ్యులతో వచ్చారు. వారికి దక్షిణ గోపురం వద్ద తెలుగుదేశం నాయకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆమెతోపాటు రాష్ట్రసాప్ చైర్మెన్ రవి నాయుడు ఉన్నారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న ఆమెకు ఆలయ చరిత్ర గురించి ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి వివరించారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ఆమెకు వేదపండితులచే ప్రత్యేక ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలుఅ ందించారు. తెలుగుదేశం నాయకులు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.ఏర్పాట్లను ఎఇఓ లోకేష్‌రెడ్డి, పిఆర్ఓ రవి తదితరులు పాల్గొన్నారు.

## పరశురామేశ్వరుని సన్నిధిలో శ్రీకాంత్ షిండే పూజలు

శ్రీకాళహస్తి రూరల్,నవంబర్ 22 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలంలోని గుడిమల్లం ఆలయంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరుని శుక్రవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏకనాథ్ శ్యాం బాజీ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే దర్శించుకున్నారు. పర్యాటక కేంద్రం పర్యవేక్షణలో ఉన్న గుడిమల్లం ఆలయం దిన దినాభివృద్ధి చెందుతుంది.ఈ నేపథ్యంలో పర్యాటక శాఖ ప్రతి రోజూ బస్సుల ప్యాకేజీలను నడుపుతుంది. శుక్రవారం శ్రీకాంత్ షిండే రాకతో ఆలయ చైర్మెన్ బత్తల గిరినాయుడు, ఆలయ ఇఓ రామచంద్రారెడ్డిలు స్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి ఆలయ చైర్మెన్ గిరిబాబునాయుడు స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలతో పాటు దుశ్శాలువలతో సత్కరించారు. మహారాష్ట్ర టూరిజంలో గుడిమల్లం గురించి పొందుపరచాలని కోరారు.

## శివయ్య సేవలో ఆకాశ దీపం

శ్రీకాళహస్తి,నవంబర్ 22 ప్రభాతవార్త :



శుక్రవారం సాయంత్రం ముల్లోకాల్ని ఏలే ముక్కం టీశుని సన్నిధిలో వేడుకుంటూ కార్తీక మాసంలో నిర్వహించే ఆకాశ దీపాన్ని ఆలయ ఎఇఓ హేమావాలి ని ఆవిష్కరించారు. ఆలయంలోని కోట మండపం వద్ద కార్తీక మాసంలో ఆకాశ దీ ఎా ని ్న ఆవిష్కరించటం, ఈ కార్యక్రమాల్లో స్థానిక భక్తులు పాల్గొనటం జరుగుతుంది. ఈ కార్యక్రమాల్లో ఆలయ పారోహితులు అర్ధగిరి వేదమంత్రాలు పఠిస్తుండగా శాస్త్రోక్తంగా ఆవిష్కరింపజేయారు. ఆలయ ఎఇఓ హేమామాలిని, అవిష్కరించగా ఆలయ పోటు ఇన్‌చార్జిసురేష్‌రెడ్డి, ఇన్సెపెక్టర్ సుదర్శనం,దఫేదార్ దాము, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## సీపీఎం జిల్లా మహా సభలను జయప్రదం చేయండి

బుచ్చినాయుడు కండ్రిగ, నవంబరు 22 ప్రభాతవార్త:



సత్యవేడులో 1,2 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దాసరి జనార్ధన్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రమైన బుచ్చినాయుడు కండ్రిగలో మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపైన పోరాటం చేస్తున్న సీపీఎం పార్టీ నిర్మాణం పరంగా మరింత పటిష్టం చేసుకునేందుకు గత మూడు సంవత్సరాలు చేసిన కృషిని సమీక్షించి రాబోయే మూడు సంవత్సరాల్లో చేయవలసిన పోరాట కార్యక్రమాలను రూపొందించి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసే మహా సభలకు ప్రజలు పెరివిగా విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. డిసెంబరు 1వ తేదీ సత్యవేడు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం వీఎంకే మండపంలో ప్రతినిధుల సభ జరుగుతుందని, ఈ సభకు రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్.వి.శ్రీనివాసరావు, మాజీ పార్లమెంట్ సభ్యులు మధు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, భాస్కరయ్యలు హాజరవుతున్నారని తెలిపారు. సత్యవేడు కేంద్రంలోనిర్వహిస్తున్న తిరుపతి జిల్లా మహాసభల్లో నియోజకవర్గంలోని ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల సీపీఎం నాయకులు నలుగురి రమణయ్య, జె.కె.రమణయ్య, ధనంజయలు, చిన్నా, గురవయ్య, తిరుపాలు, సుబ్బయ్య, ఆదయ్య, రమణయ్య, కృష్ణమ్మ, చెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డేపల్లిలో హెల్త్ టాస్క్ పోర్స్ టీమ్

పాకాల, నవంబర్ 22 ప్రభాతవార్త:



పాకాల మండలం కె వడ్డేపల్లి గ్రామం సచివాలయంలో శుక్రవారం రోజున టాస్క్ ఫోర్స్ టీం తిరుపతి డివిజన్ వారు సందర్శించడం జరిగింది. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి అన్ని రికార్డును వెరిఫై చేసి ఆశలు వర్కర్ల బుక్స్ రికార్డ్స్ వెరిఫై చేసి తగు సూచనలు చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య టాస్క్ పోర్స్ ప్రతినిధులు ప్రకాష్,సురేష్, ప్రభుత్వ వైద్య నిపుణులు డాక్టర్ మురళీకృష్ణ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## సిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు లక్ష విరాళం

కాణిపాకం, నవంబర్ 22 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తుడు శుక్రకారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తెలంగాణా రాష్ట్రం సంగారెడ్డికి చెందిన ప్రసాద్ అనే భక్తుడు 1,00,001 రూపాయలను విరాళంగా అందజేశారు. విరాళ మొత్తాన్ని దాతలు కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవిలకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

## రీసెర్చ్ అసోసియేట్,రీసెర్చ్ పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి విద్య, నవంబర్ 22 ప్రభాతవార్త:

మహిళా వర్సిటాలో రీసెర్చ్ అసోసియేట్,సీనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఎం -ఉషా ప్రొగ్రాం కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ సి వాణి ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం-ఉషా,ఎమ్మార్యూ పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వ మంజూరు చేసిన ప్రాజెక్టుల కోసం పనిచేసేందుకు నియామకాలను చేపట్టామని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు వచ్చేనెల 4వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, డిసెంబర్ 17న ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.దరఖాస్తులతో పాటు మరిన్ని వివరాలకు పద్మావతి మహిళా వర్సిటీ అధికారిక వెబ్సైటున్న సంప్రదించాలని కోరారు.

## మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్

రేణిగుంట, నవంబరు 22 ప్రభాతవార్త:



రేణిగుంట పంచాయతీ శివారులోని గణేష్‌నగర్‌లో శుక్రవారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి గ్లాడ్విన్ అనే వ్యక్తి వద్ద పదిమద్యం సిసాలను స్వాధీనం చేసుకు న్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ అధికారులు బెల్ట్‌షాపులపై ఆకస్మికంగా దాడులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నరసనాయుడు, సబ్ ఇన్‌స్పెక్టర్ కవిశ్వర్ నాయుడు, తమ సిబ్బందితో నిర్వహించిన దాడుల్లో రేణిగుంట గణేష్ నగర్ వద్ద గాడ్విన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద పది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి నిందితుని కోర్టుకు పంపారు.

## అటవీ ప్రాంతంలో సూచిక బోర్డు

రేణిగుంట, నవంబరు 22 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం మామండూరు అటవీ ప్రాంతంలో తిరుపతిజిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో అర్బన్ సీఐ శరత్ చంద్ర ఆధ్వర్యంలో అర్బన్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి తమ సిబ్బందితో శుక్రవారం ప్రమాద హెచ్చరికలను తెలియజేసే సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ మధ్యకాలంలో మామండూరు అటవీ ప్రాంతంలోని జలాశయాలకు సంబంధించిన మడుగులు అక్కడక్కడ విపరీతమైన లోతు ఉండడంతో పలువురు మృత్యువాత పడ్డారు. ఎట్టి పరిస్థితుల్లో ఈత రాని వారు జలాశయం మడుగులు, గుంతల్లో దిగరాదని హెచ్చరించారు. పర్యాటకులు జాగ్రత్త వహించాలని కోరారు.



## విద్యాదీశతీర్థస్వామిని కలసిన టిటిడి ఈఓ

తిరుమల,నవంబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:

వ్యాసరాజమఠంలో వేంచేసిన మఠాధిపతి విద్యాదీశతీర్థ స్వామిని శుక్రవారం సాయంత్రం టిటిడి ఈఓ జె.శ్యామలరావు దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఆరోగ్యంపై పూర్తి అవగాహన పెంచుకోవాలి

తిరుపతి విద్య నవంబర్22 ప్రభాతవార్త:



శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం లో డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో మహిళల హక్కులు ఆరోగ్యం,పరిశుభ్రత అంశంపై సదస్సు జరిగింది.మహిళలకి మాత్రమే ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని వర్సిటీ ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సదస్సు కూ విచ్చేసిన మహిళ ఉద్యోగులు,పరిశోధకులు, విద్యార్థినులు వారి వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రత, హక్కుల పై అవగాహన కల్పిస్తుందని అన్నారు.ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎం పద్మజ మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ కు వ్యతిరేకంగా 14-45 సంవత్సరాల వయస్సు గల మహిళలందరికీ హెచ్ పి విట్యాక్సిన్ అందుబాటులో ఉంది. యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లను ఎలా వస్తాయి,వాటిని ఎలా నయం చేయాలి,తక్కువ మందులతో ఎలా పరిష్కరించాలి అనేది ఆమె వివరించారు.ఈ కార్యక్రమ నిర్వాహకుడు కల్చరల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్,ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ,అకడమిక్ కన్సల్టెంట్లు డాక్టర్ కళ్యాణ్,డాక్టర్ గట్టు రంజిత్,డాక్టర్ సుదర్శన్ రెడపాల్గొన్నారు.

## సి.యం.గారు చంద్రగిరి అభివృద్ధికి సహకరించండి

తిరుపతిరూరల్, నవంబర్22 ప్రభాతవార్త:



చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధికి సహాకారం అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్యే పులివర్తి నానికి వ్రాతపూర్వకంగా వినతిపత్రాన్ని అందజేసారు. పాకాల మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చి అన్ని విధాలుగా మౌళికసదుపాయాలు కల్పించాలని కోరారు. తిరుపతిరూరల్ మండలంలో గతంలో జరిగిన వర్షాల వల్ల నాలుగు వంతెనలు తెగాయని, అప్పటినుండి ఇప్పటివరకు బ్రిడ్జిలను పున:నిర్మించలేదని, ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వంలో పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. అలాగే చంద్రగిరి నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి దుర్భరంగా ఉందని, తిరుపతి నగరపాలక సంస్థకు అనుకుని పంచాయతీలలో కూడా గత పాలకుల వల్ల రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని వివరించారు. చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. చంద్రగిరి అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## జన విజ్ఞాన వేదికచే...జ్ఞాపికలు బహుకరణ



గూడూరు, నవంబర్ 22 ప్రభాతవార్త: గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు వాకాటి రామ మోహన్ దాతృత్వంలో జిల్లా స్థాయిలో హాకీలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు షూస్, షటిల్ క్రీడలో జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారునికి బహుమతి జ్ఞాపిక అందించారు. జన విజ్ఞాన వేదిక సంస్థకి అన్ని విధాలా సహకరిస్తున్న ఆత్మీయ ఉపాధ్యాయురాలు కల్పనాకి జేవివి తరుపున జ్ఞాపికను సీనియర్ సభ్యులు పురుషోత్తం, చెంచునారాయణ ద్వారా అందిం చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్, చెంచు నారాయణ, నాగరాజు, పురుషోత్తమ రావు, పి.డి.శివకుమార్, టీచర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు దుప్పట్లు పంపిణీ



గూడూరు, నవంబర్ 22 ప్రభాతవార్త : గూడూరు రెండవ పట్టణంలోని ఇందిరా నగర్ చవట గిరిజన కాలనీలో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర డ్రైవింగ్ స్కూల్ వాసు సహకారంతో సీనియర్ రొటేరియన్స్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి, శ్రీకంటి రామ్మోహనరావు, కార్యదర్శి చోళవరం గిరిబాబు చేతుల మీదుగా పేద గిరిజనులకు దుప్పట్లను పంపిణీ చేశారు. 150 మంది పేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్లు దువ్వూరు రవీంద్రారెడ్డి, డివి బాలసుబ్రమణ్యం, ధనుంజయ రెడ్డి, సనత్ రెడ్డి, బలరామిరెడ్డి, పర్చూరి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు ప్రధానం



గూడూరు, నవంబర్ 22, ప్రభాతవార్త: గూడూరు పట్టణంలోని ఎస్. కె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు విక్రమ సింహపురి యూనివర్సిటీ అంతర కళాశా లల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్ మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో తమ కళాశాలలో క్రీడా పోటీలు జరగడం అభినంద నీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. శ్రీనివాసులు, పి.నారాయణ రాజు, వెంకటేశ్వర్లు, రవీంద్ర బాబు, ప్రసాద్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్, మణికంఠ, శ్రీనివాసులు, తిరుపాల్, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అంచనాల కమిటీ సభ్యులుగా ఎమ్మెల్యే



గూడూరు, నవంబర్ 22 ప్రభాతవార్త : అసెంబ్లీలో శుక్రవారం జరిగిన ఎలెక్షన్ లలో అంచనాల కమిటీలో సభ్యులుగా గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్‌కు అవకాశం కల్పించారు. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సి.యం కొణిదల పవన్ కళ్యాణ్‌కి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుకి, తోటిశాసన సభ్యులకు గూడూరు ఎమ్మెల్యే డా. పాశం సునీల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## పేద కుటుంబాలకు కూరగాయలు పంపిణీ



వాకాడు, నవంబర్ 22 ప్రభాతవార్త: శ్రీ సీతారామభార్గవ సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కార్తీక మాస పర్వదినాలను పురస్కరించుకొని వాకాడు మండలం కోడివాక గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆర్థికంగా వెనుకబడిన రెండు కుటుంబాలకు సాలూరు రాజేశ్వర కోటేశ్వరరావు (కోటి), జ్యోతి దంపతులు ఆర్థిక సౌజన్యంతో 6500 రూపాయల విలువచేసే ఫల సరుకులు,ఫ్యాన్సీ సరుకులు, కూరగాయలు, సంభావనలను సంస్థ ప్రతినిధి దేవి అనంతబాబు, నరేష్ శర్మ, పవన్ కుమార్ శర్మలు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి దేవి అనంతబాబు మాట్లాడుతూ ప్రముఖ చలనచిత్ర సంగీత దర్శకులు కోటి, సతీమణి జ్యోతి దంపతుల ఆర్థిక సౌజన్యంతో ఆలూరు రంగయ్య శర్మ, సుబ్బ లక్ష్మమ్మ, సరస్వతుల వెంకట సుబ్రహ్మణ్య శర్మ, రమ్యకృష్ణ రెండు కుటుంబాలకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జనమంచి పవన్ కుమార్ శర్మ, నాగ మోనిక, అరసి నరేష్ శర్మ, ఆలూరు లక్ష్మీ నరసింహ శర్మ, గోపాలకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

## కుయ్ కుయ్... మోగిన సమ్మె సైరన్

**- ఈనెల 25 నుంచి 108 సిబ్బంది సమ్మెబాట**

కోట, నవంబర్ 22 ప్రభాతవార్త: ఆపద వస్తే ఆపద్బంధువులా వచ్చే 108 సిబ్బందికి కష్టం వచ్చింది. రోగంతో ఆసుపత్రిలో చేరాలని సమాచారం అందివస్తే చాలు.. కుయ్ కుయ్‌మంటూ నిముషాల వ్యవధిలో వాహనాన్ని తీసుకొచ్చే పైలెట్, ఈఎంటీలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని, గత ప్రభుత్వ హయాంలో రద్దు చేసిన రాయితీలను కూడా అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే తమ డిమాండ్లపై రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారులకు వినతులు ఇచ్చారు. ఆ మేరకు శుక్రవారం 108 జిల్లా వర్కింగ్ అధ్యక్షులు కడగొండ సునీల్ ప్రభాతవార్తతో మాట్లాడారు. తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ కూడా సమ్మె నోటీసులు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ప్రిన్సిపాల్ సెక్రటరీతో యూనియన్ నాయకులు చర్చలు కూడా జరిగాయని కాని ఆ చర్చలు ఫలించలేదన్నారు. ఆ డిమాండ్లు పరిష్కరించకపోతే ఈ నెల 25 నుంచి సమ్మెబాట పట్టనున్నట్లు 108 ఉద్యోగులు తెలిపారు. ప్రధానమైన డిమాండ్లు పరిష్కరించాలని తామంతా సమ్మెబాట సమ్మెలోకి వెళ్లుతున్నట్లు సునీల్ చెప్పారు.

## 24న బ్రాహ్మణ వన సమారాధన



వెంకటగిరి, నవంబర్ 22 ప్రభాతవార్త : ఈనెల 24వ తేదీ బ్రాహ్మణ వన సమారాధన, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సేవా సంఘాల అధ్యక్షులు గుడ్లదోన వాసుదేవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కామేశ్వర ప్రసాద్ తెలిపారు. వారు మాట్లాడుతూ కార్తీక మాసం మహా రుద్రాభిషేకం, బ్రాహ్మణ వన సమారాధన సామూహిక సత్య నారాయణ స్వామి వ్రతం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. శ్రీ రమా సహిత శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొను దంపతులు సాంప్రదాయ దుస్తులతో పూజకు విడి పుష్పములు, పంచ పాత్ర, ఉద్ధరిణి, హరివేణము కలిశము చెంబు తెచ్చుకోవలెను. పై కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, కోశాధికారి దుద్దుకూరు రమేష్,మహిళ విభాగ అధ్యక్షురాలుఐ.జయలక్ష్మి, సెక్రెటరీ సురభి.ఉమాదేవి, ఉపాధ్యక్షులు ప్రతిభారాణి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం :ఈఈ

బాలాయపల్లి, నవంబర్ 22 ప్రభాతవార్త వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యమని ఆశాఖ నాయుడుపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.శ్రీనివాసులు తెలిపారు. బాలాయపల్లిలోని సబ్ స్టేషన్‌ను డిఈఈ ముని రవిచంద్ర తో కలిసి ఆయన పరిశీలించారు. రైతులకు కూడా నిరంత రాయంగా కరెంటు అందిస్తామని చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. జయంపులో రాగి వైరు చోరీకి గురైందని ఇలాంటి దొరక్కుండా చూసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఏఈ అశోక్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్ విద్యార్థుల సైకిల్ ర్యాలీ





కోట, నవంబర్ 22 ప్రభాతవార్త : కోట మండలం విద్యా నగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి నావల్ ఎన్‌సిసి క్యాడెట్స్ 76వ ఎన్‌సిసి దినోత్సవ ఉత్సవాలు సందర్భంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గోడంగావే ఆదేశాల మేరకు ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి విద్యార్థులు సుమారు 40 మంది కళాశాల నుంచి వాకాడుకు, తిరిగి కళాశాల వరకు సైకిల్ ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం వీరు దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన, దేశం కోసం యుద్ధంలో ప్రాణాలు అర్పించిన సైనికులకు నివాళి అర్పించారు.ప్రతి సంవత్సరం నవంబర్ నాలుగవ ఆదివారం ఎన్‌సిసి దినోత్సవం జరుపుకుంటున్నారు. ఈ కార్యక్రమం ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి నావెల్ యూనిట్ ఆఫీసర్ సబ్ లెఫ్టినెంట్ వి.మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా ఎస్ అండ్ హెచ్ విభాగాధిపతి డాక్టర్ సి.రవీంద్రారెడ్డి విచ్చేసి జెండా ఊపి ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం క్యాడెట్లకు ఫలహారాలు అందజేశారు.

## దుప్పట్లు పంపిణీ



వెంకటగిరి, నవంబర్ 22 ప్రభాతవార్త : పుట్టపర్తి సత్య సాయిబాబా జన్మదిన సందర్భంగా సత్యసాయి సేవా సమితి వారి ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వందమందికి దుప్పట్లను అంద జేశారు. సత్య సాయి బాబా సేవ సమితి ఆధ్వర్యంలో విరివిగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలు సాయిబాబా భక్తులు పాల్గొన్నారు.

## కొత్తపట్నం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

కోట, నవంబర్ 22 ప్రభాతవార్త : కోట మండలం కొత్తపట్నం పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌ను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సస్పెండ్ చేసినట్లు ఎంపిడిఓ వేణు తెలిపారు. శుక్రవారం ఎంపిడిఓ వేణు విలేఖరులతో మాట్లాడుతూ కొత్తపట్నం పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ గతంలో ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పంచాయతీలో కార్యదర్శిగా ఉండగా విధి నిర్వహణలో పలు ఆరోపణలు రావడంతో డిపిఓ సమగ్ర విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. ఈ మేరకు కార్యదర్శి రాజశేఖర్‌ను సస్పెండ్ చేశారని తెలిపారు.

## మోటార్ సైకిల్ బోల్తా-ఇద్దరికి తీవ్రగాయాలు

నాయుడుపేట టౌన్ నవంబరు 22 ప్రభాతవార్త ;నాయుడుపేట మండలంలోని మేనకూరు వద్ద మోటార్‌సైకిల్ బోల్తాపడి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం జరిగింది. నాయుడుపేటకు చెందిన పుల్లారెడ్డి,లక్ష్మయ్యలు మోటార్ సైకిల్‌పై మేనకూరు సమీపంలో ఉన్న కంపెనీలో పనిపూర్తి చేసుకొని తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో మేనకూరు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ప్రమాధవశాత్తు మోటార్ సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న పుల్లారెడ్డి, లక్ష్మయ్యలు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108 సహాయంతో చికిత్సనిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాయుడుపేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కౌన్సిలర్ పరామర్శించిన వైసీపీ నేతలు



వెంకటగిరి, నవంబర్ 22 ప్రభాతవార్త : 16 వార్డు కౌన్సిలర్ ధనియాల రాధ అనారోగ్యంతో బాధపడు తున్నడంతో రాజ వంశస్థులు, వైసీపీ నేత వి.సర్వజ్ఞ కుమార యాచేంద్ర పరామర్శించారు. గత కొద్ది రోజుల నుండి ఆమె అనారోగ్యం తో బాధపడు తున్నారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, కౌన్సిలర్లు జి ఢిల్లీ బాబు, ఎం ఏ నారాయణ, శంకరయ్య తదితరులు పరామర్శించారు.

## రాష్ట్ర మంత్రి, ఇంచార్జ్ సత్యప్రసాద్‌ని కలిసిన టిడిపి శ్రేణులు

**-సత్యవేడు ఎమ్మెల్యేపై సస్పెండ్ ఎత్తేయాలని వినతి**



నారాయణవనం, నవంబర్ 22 ప్రభాతవార్త : రాష్ట్ర మంత్రివర్యులు, తిరుపతి జిల్లా ఇంచార్జ్ అనగాని సత్యప్రసాద్‌ని నారాయణవనం మండలం తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం అమరావతిలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యప్రసాద్‌కి నారాయణవనం మండల అభివృద్ధిలో వెనుకబడుతున్న విషయాలను క్షుణ్ణంగా వివరించారు. మండలంలో జరగాల్సిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. అనంతరం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై ఉన్న సస్పెండ్‌ని ఎత్తివేయాలని, ఆయన నేతృత్వంలో సత్యవేడు నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుం దని, ఆయన సేవలు తెలుగుదేశం పార్టీకి తప్పక అవసరమని గుర్తు చేశారు. రాజకీయంగా ఎంతో అనుభవం కలిగిన వ్యక్తని, ప్రతి గ్రామం నుంచి నాయకులను, కార్యకర్తలను పేరు పిలవగలిగిన నేత అని గుర్తుచేశారు. ఆయన కొంతమంది ఇండిపెండెంట్ అభ్యర్థి యాతాటి రమేష్‌బాబు, వైకాపా నాయకులు కుట్ర పన్ని ఇరికించారని ఆవేదన వ్యక్త పరిచారు. ఎమ్మెల్యేపై వున్న సస్పెండ్‌ని ఎత్తివేస్తే ఆయన నేతృత్వంలో మేమంతా పని చేయడానికి సిద్ధంగా వున్నామన్నారు. అనంతరం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎన్ భాస్కరన్, మాణిక్యంరెడ్డి, అచ్చుకట్ల హరి, వేలురెడ్డి, రాజశేఖర్‌యాదవ్, నరేస్ ఆచ్చారి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో రక్తహీనతకు అడ్డుకట్ట

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి**



చిత్తూరు, నవంబర్ 22 ప్రభాతవార్త: బాలికలకు పౌష్టికాహారం అందించి రక్తహీనత నుండి కాపాడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి అన్నారు. కలెక్టరేట్‌లోని డిఆర్‌డిఎ సమావేశ హాలులో శుక్రవారం జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కిషోరి వికాశం జిల్లా స్థాయి కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో డిఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రభావతిదేవి మాట్లాడుతూ కిషోర బాలికలకు ఆరోగ్య సంరక్షణ అవసరమని, భవిష్యత్తు తరాలకు జన్మనిచ్చే తల్లిగా ఆరోగ్యం కాపాడుకోవడం అవసరం అన్నారు. మనదేశంలో పౌష్టికాహార లోపంతో దాదాపు 50 శాతం పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారని, వారికి పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవస్యకతను వివరించి రక్తహీనత నుండి రక్షించాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్ మాట్లాడుతూ బాలికలకు విద్య అందించడం ద్వారా వారు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగసౌజన్య, సిడిపిఓలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి : గంజి మాధవయ్య



పుత్తూరు, నవంబరు 22 ప్రభాతవార్త :ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ఆదేశాలతో మండలంలోని అని న్ గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీల వంటి అభివృద్ధి పనులు ప్రారంభించామని పద మ్శాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్, మాజీ ఎంపిపి గంజి మాధవయ్య అన్నారు. మండలంలోని పరమేశ్వరమంగళం పంచాయతీ కైలాసపురం కనంమిట్ట గ్రామంలో రూ. 2.00లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను డిసెంబరు నెలాఖరులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం.జయశేఖర్, తెలుగుదేశం పార్టీ నాయకులు మోహన్‌రాజు, సుధాకర్‌నాయుడు, కృష్ణకుమార్, చలపతిస్వామి తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## హస్త కళాకారులను ఆదుకోండి



శ్రీకాళహస్తి,నవంబర్ 22 ప్రభాతవార్త : ప్రపంచ క్రాఫ్ట్ కౌన్సిల్ సారధ్యంలో మూడు రోజుల పాటు న్యూఢిల్లీలో జరుగుతున్న హస్తకళల ఉత్పత్తుల ప్రదర్శన జరుగుతుంది. శుక్రవారం ఈ ప్రదర్శన ప్రారంభం అయ్యింది. ఈ ప్రదర్శనలకు శ్రీకాళహస్తి నుంచిజాతీయ అవార్డు గ్రహీత గుమ్మడి దశరధాచ్చారి హాజరయ్యారు. ఈ ఎగ్జిబీషన్‌లో ఆంధ్ర ప్రదేశ్ నుంచి కొయ్యబొమ్మలు, కలంకారి ఇతర హస్తకళలకు సంబంధించిన కళాకారులు వారి ఉత్పత్తులను ప్రదర్శనకు తీసుకెళ్ళారు.ఈ సందర్భంగా దశరధాచ్చారి జౌళి శాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గరిటాను కలసి వినతి పత్రం అందించారు.భారత దేశంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ రకాల చేతి వృత్తుల వారు జీవనం గడుపుతున్నారు. వారి జీవనాన్ని కాపాడటానికి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. అలాగే ఎగ్జిబీషన్‌లు ఎక్కువగా జరిపి కళాకారులను ఆదుకోవాలని రావటానికి వెళ్ళటానికి ప్రభుత్వం ఖర్చులు అందించాలని మంత్రిని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం కళలను ప్రోత్సహిస్తుందని కళాకారుల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తుందని ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. చేతివృత్తుల కళాకారులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చినట్లు దశరదాచ్చారి తెలిపారు.మంత్రిని కలసిన వారిలో దశరధాచ్చారితో పాటు కలంకారి కళాకారుల తరపున సుధీర్,తోలుబొమ్మల కళాకారుల తరపున కుళ్ళాయప్ప పాల్గొన్నారు.

## అంతర్ కళాశాలల క్రికెట్ విజేతగా సీకామ్



తిరుపతి విద్య నవంబర్ 22 ప్రభాతవార్త: ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్ కళాశాలల క్రికెట్ పురుషుల టోర్నమెంట్లో విజేతగా సీకాం కళాశాల నిలిచింది.ఈ నెల 18 నుంచి జరిగిన టోర్నమెంట్ల వర్సిటీ పరిధిలోని పలు కళాశాల నుంచి 26 జట్లు పోటీ పడగా తిరుపతి సీకాం కళాశాల ఛాంపియన్గా నిలువగా, కలికిరి సీకాం కళాశాల రన్నరప్ స్థానాన్ని నిలబెట్టుకున్నాయి. వర్సిటీ వీసీ సిహెచ్ అప్పారావు చేతుల మీదగా విజేత జట్టుకు మెడల్స్,సర్టిఫికెట్,ట్రోఫీ అందించగా.రన్నరప్ జట్టుకు రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ట్రోఫీ నీ అందజేశారు.ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వర్సిటీకి దాదాపు 40 కోట్ల ఖేలో ఇండియా నిధులు సాధించేందుకు ప్రయత్నిస్తున్నామని, వచ్చే విద్యా సంవత్సరంలో సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ వర్సిటీలో నిర్వహించేందుకు ప్రతిపాధనలు పంపామని తెలిపారు.ఈ సందర్భంగా క్రీడారంగానికి పెద్ద పేట వేసి విద్యార్థులను ప్రోత్సహిస్తున్న సీకాం కళాశాల ఛైర్మన్,ఎస్వీయూ పాలకమండలి సభ్యులు డాక్టర్ సురేంద్ర రెడ్డి నీ,డైరెక్టర్ ప్రణీత్ రెడ్డిని వీసీ,రిజిస్ట్రార్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ శివశంకర్ రెడ్డి,డాక్టర్ పత్తిపాటి వివేక్,డాక్టర్ పాకనాటి హరికృష్ణ,స్వరాజ్య లక్ష్మీ,రంజిత్ విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీశక్తిపీఠంలో కాళభైరవ నవరాత్రులు



రామచంద్రాపురం, నవంబర్ 22 ప్రభాతవార్త: రాయలచెరువు కట్ట సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠంలో కాళభైరవ నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం శ్రీకాళభైరవ స్వామి వారికి కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్దేశ్వర మహాభారతి స్వామి ఆధ్వర్యంలో మంత్ర మహేశ్వరీ శ్రీరమ్యానంద భారతి వివిధ సుగంధభరిత పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. 11,116 గారెలతో శ్రీస్వర్ణాకర్షణ భైరవ హోమం నిర్వహించారు. అనంతరం మంత్రోపదేశంతో భక్తులను అనుగ్రహిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తిరిచ్చిపై విహరించిన అలివేలుమంగ



తిరుచానూరు, నవంబర్ 22 ప్రభాతవార్త : తిరుచ్చి వాహనంపై అలివేలు మంగ తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. తిరుచానూరులోని అమ్మవారి ఆలయంలో ప్రతి శుక్రవారం సేవలో భాగంగా అమ్మవారిని సుప్రభాతంతో మేలుకొలిపి సహస్ర అర్చన, నిత్య అర్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపం వద్ద వైభవంగా కళ్యాణోత్సవం చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఉద్యానవనంలో వివిధ సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం అమ్మవారిని సుందరంగా అలంకరించి తిరిచ్చిపై తిరుమాడ వీధులలో విహరించారు. అమ్మవారు భక్తులకు అభయమిచ్చారి. యాత్రికులు,స్థానిక భక్తులు కర్పూర హారతులతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సిబ్బంది సుభాస్కర్, ఏవియస్‌ఓ సతీష్,అర్చకులు, ఇతర తితిదే సిబ్బంది పాల్గొన్నారు.

## వేలం పాటల ద్వారా రూ.4.45 కోట్లు ఆదాయం

కాణిపాకం, నవంబర్ 22 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి దేవస్థానంలో శుక్రవారం వివిధ లీజు హక్కుల కోసం నిర్వహించిన బహిరంగ వేలం, సీల్డ్, ఆన్‌లైన్ టెండర్లు ద్వారా 4.45 కోట్లు రూపాయలు ఆదాయంగా లభించింది. ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ఆస్థాన మండపంలో వివిధ లీజు హక్కుల కోసం ఏడాది కాలపరిమితితో వేలం పాటలను నిర్వహించారు. వాహనపూజా సామాగ్రి విక్రయించుకునే హక్కుల లీజు ద్వారా 50.50 లక్షలు, కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకునే హక్కు లీజు ద్వారా 45.66 లక్షలు, కోనేరు వద్ద నేతి దీపాలు విక్రయించుకునే లీజు హక్కుద్వారా 67 లక్షలు, వినాయకసదన్ హోటల్ నిర్వహిచుకునే లీజు హక్కుద్వారా 27 లక్షలు, చెవి, ముక్కు పోగులు కుట్టు లైసెన్స్ హక్కు ద్వారా 6.50 లక్షలు, మరగదాంభిగా కళ్యాణ మండపం వద్ద బంకు ఏర్పాటు లీజు 63 వేలు, శివాలయం వద్ద బంకు ఏర్పాటు లీజు ద్వారా 6.31 లక్షలు ఆదాయంగా వచ్చింది. అలాగే దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్ నందు 24 దుకాణాలు టెండర్లు ద్వారా 2,40,88,860 రూపాయలు ఆదాయంగా వచ్చింది. ఈకార్యక్రమంలో ఈఓ పట్టెం గురుప్రసాద్, దేవాదాయశాఖ అధికారి సుబ్రమణ్యంనాయుడు, ఏఈఓలు ఎస్ .కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనుంజయ, ప్రసాద్, సూపరెండెంట్‌లు బాలరంగస్వామి, కోదండపాణి, టెండరుదారులు పాల్గొన్నారు.

## పిఎసి 3లో 1,420 లాకర్లు

**-కేంద్రీయ లాకర్ కేటాయింపు కౌంటర్లు ప్రారంభం**



తిరుమల,నవంబర్ 22 ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలకు వస్తున్న భక్తులకు గదులు దొరకని సమయంలో యాత్రికుల వసతి సముదాయాల్లో లాకర్లు సదుపాయం అందుకోవచ్చని టిటిడి ఈఓ జె.శ్యామల రావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. పిఎసి 3లో నూతనంగా ఏర్పాటుచేసిన కేంద్రీయ లాకర్ కేటాయింపు కౌంటర్లను శుక్రవారం మధ్యాహ్నం టిటిడి సిఇ సత్యనారాయణ, డిప్యూటీ ఈఓ పి.హరీంద్రనాథ్, డిఇ చంద్రశేఖర్‌తో కలసి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రారంభించారు. ఇందులో 1,420 లాకర్లు భక్తులకు సౌకర్యవంతంగా అందుబాటులో ఉంటాయి. అంతకుముందు ఉదయం తిరుమలలోని ఆకాశగంగ, పాపవినాశనం తీర్థాలను సందర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలాశయాలకు నీరుచేరడంతో పరిశీలించారు. భక్తులకు సౌకర్యాల కల్పనపై అధికారులకు ఆదేశాలిచ్చారు.

## కొంగనపల్లి విఆర్వోకు దేహశుద్ధి చేసిన మహిళా విఆర్వో కుటుంబీకులు

**- ప్రేమించి పెళ్లి విషయం దాటవేస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు !!**



రామకుప్పం, నవంబర్ 22 ప్రభాతవార్త : సహ విఆర్వోగా పనిచేస్తున్న ఓ యువతిని ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని నమ్మించిన ఓ విఆర్వో పెళ్లి విషయం దాట వేసేలా ప్రవర్తించడంతో మహిళా విఆర్వో కుటుంబీకులు ఏకంగా తహశీల్దార్ కార్యాలయం వద్దనే విఆర్వోకు దేహశుద్ధి చేసిన సంఘటన రామకుప్పంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన మేరకు వివరాలిలా.. కడపజిల్లాకు చెందిన శ్రవణ్ అనే వ్యక్తి రామకుప్పం మండల ం కొంగనపల్లి విఆర్వోగా విధుల్లో చేరాడు. రామకుప్పం మండలం గిడ్డపల్లికి చెందిన ఓ యువతి బందార్లపల్లి సచివాలయం విఆర్వోగా విధులు నిర్వహిస్తోంది. వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఈనేపథ్యంలో తనను వివాహం చేసుకోవాలని మహిళా విఆర్వో శ్రవణ్‌ను కోరుతూ వస్తోంది. అయితే గత రెండేళ్లుగా అతను పెళ్లి విషయంలో స్పష్టత ఇవ్వకపోగా డొంక తిరుగుడుగా మాట్లాడడం మొదలుపెట్టాడని తెలిపారు. శుక్రవారం యువతి బంధువులు ఈ విషయంగా తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని శ్రవణ్‌ను నిలదీయగా అతను సరైన సమాధానం ఇవ్వకపోగా ఆగ్రహంతో మహిళా విఆర్వో బంధువులు శ్రవణ్‌కు దేహశుద్ధి చేసి అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంగా బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో కృపారాణి బంధువులు శాంతించారు.

## గంజాయి విక్రయిస్తూ... పోలీసులకు పట్టుబడ్డ యువకుడు



నారాయణవనం, నవంబర్ 22 ప్రభాతవార్త : మండలంలోని పాలమంగళం దక్షణపుకండ్రిగకు వెళ్లే మార్గంలో యువతకు గంజాయిని విక్రయిస్తూ స్థానిక పోలీసులకు జగబిళ్ల రాజ్‌కుమార్ (28) పట్టుబడ్డాడు. పుత్తూరు రూరల్ సిఐ జిరవీంద్ర, నారాయణవనం ఎస్ఐ కె.రాజ శేఖర్‌ల కథనం మేరకు వివరాలు ఇలా వున్నాయి. పాలమంగళం దక్షణపుకండ్రిగ వద్ద ఉన్నత పోలీసుల అధికారులకు వచ్చిన సమాచారం మేరకు సిఐ రవీంద్ర, ఎస్ఐ రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. ఇదే సమయంలో మండలంలోని నైనారుకండ్రిగ పంచాయతీ మిట్టనైనారుకండ్రిగ గ్రామానికి చెందిన జడబిళ్ల రాజ్‌కుమార్(28) నుంచి 2కిలోల100గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇతను చుట్టు పక్క గ్రామాలకు చెందిన యువతకు, అలాగే బయట ప్రాంతం నుంచి ఈ ప్రాంతాల్లో కూలీ పనులు చేసుకొని బతుకుతున్న వారికి ఈ గంజాయిని విక్రయించడం జరుగుతుందని విచారణలో బయటపడింది. ఈ గంజాయి మత్తుకు ఇప్పటికే చాలా మంది బానిస అయినట్లు చెప్పారు. ప్రస్తుతం పట్టుబడ్డ వ్యక్తిపై గత ఏడాది కూడా గంజాయి కేసు నమోదై వుందని గుర్తు చేశారు. పట్టబడ్డ రాజశేఖర్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్టు చెప్పారు. ఎవరైనా గంజాయి అమ్మడం, కోనుగోలు చేయడం వంటి చట్ట విరుద్ధపు పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని గుర్తు చేశారు.

## నగరంలో చెత్త కుప్పలు కనిపిస్తే కఠిన చర్యలు : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 22 ప్రభాతవార్త : తిరుపతి నగరంలో రోడ్ల పక్కన, వీధుల్లో ఎక్కడైనా చెత్త కుప్పలు కనిపిస్తే సంబంధిత సిబ్బందిపైన, చెత్త వేసిన వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను హెచ్చరించారు. నగరంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, శానిటరీ సెక్రటరీలు, సిబ్బంది విధులపై శుక్రవారం సాయంత్రం కచ్చపి ఆడిటోరియంలో శానిటరీ అధికారులతో కమిషనర్ సమావేశమయ్యారు. ఆయా వార్డుల్లో మెస్త్రీలు, శానిటరీ సెక్రటరీలు ఏ మేరకు పారిశుద్ధ్య పనులు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. నగరంలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించకపోవడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధం సరిగా లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ఏ వార్డులో అయినా, వీధిలో అయినా రోడ్లపైన చెత్త కుప్పలు కనిపించినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టేందుకు ఐదు వార్డులకు ఒక్కో అధికారిని ప్రత్యేకంగా నియమిస్తున్నామని అన్నారు. ఇంటింటికి చెత్త సేకరణకు ప్రతి వాహనం నిర్దిష్ట సమయంలో వెళ్లేలా చూడాలని అన్నారు. నగరంలో ఉత్పత్తి అయిన చెత్త మొత్తం తూకివాకంకు తరలించి నిర్వహణ చేయాలని అన్నారు. ప్రతి వాహనం ఏ వార్డుల్లో వెళుతుంది, వాహనంతో ఎవరు వెళుతున్నారని స్పష్టమైన షెడ్యూల్ ను సిద్దం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజూ ఉదయం హాజరు నమోదు అయిన వెంటనే ప్రధాన వీధులను శుభ్రం చేస్తూ, చెత్త కుప్పలు తొలగించాలని అన్నారు. అటు తరువాత వీధుల్లో ఇంటింటి చెత్త సేకరణ చేయాలని అన్నారు. సేకరించిన చెత్తను నేరుగా చెత్త సేకరణ కేంద్రానికి తరలించాలని, అక్కడ నుండి తూకివాకం లోని చెత్త నిర్వహణ కేంద్రానికి తరలించాలని అన్నారు. నగరంలో ఉత్పత్తి అయ్యే చెత్త పూర్తిగా నిర్వహణ కేంద్రానికి తరలించడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయన్నారు.